హైదరాబాద్ వార్త



# హైడ్రా ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు 1070

**హైదరాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** హైడ్రాకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించడానికి టోల్‌ఫ్రీ నంబరు 1070 అందుబాటులోకి వచ్చింది. 1070 నంబరుకు ఫోను చేసి ఫిర్యాదులు చేయవచ్చునని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ ద్వారా సమాచారాన్ని అందించవచ్చునని తెలిపారు. మరీ ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, చెట్లు పడిపోయినా, వరద ముంచెత్తినా, అగ్ని ప్రమాదాలు జరిగినా ఇలా ప్రమాదకరమైన పరిస్థితులున్నప్పుడు హైడ్రాకు సంబంధించిన సేవలన్నిటికోసం టోల్ ఫ్రీ నంబరు 1070 ద్వారా సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.



కమిషనర్ రంగనాథ్

ఓఆర్ఆర్ పరిధిలో ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు 8712406899 నంబరుకు సమాచారం ఇవ్వడంతో పాటు.. వాట్సాప్ ద్వారా ఫిర్యాదుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు పంపించవచ్చునని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు. దీనికి తోడు.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, భారీ వర్షాలు పడి కాలనీలు, రహదారులు నీట మునిగినా, అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే 8712406901, 9000113667 ఈ రెండు నంబర్లకు ఫోను చేయాలని హైడ్రా కోరింది. 1070 టోల్ ఫ్రీ నంబరుతో పాటు.. పైన పేర్కొన్న మూడు సెల్ నంబర్లను ప్రజలు వినియోగించుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు.



బాలాపూర్‌లో పోటెత్తిన భక్తుల దృశ్యం

### బాలాపూర్ బొజ్జ గణపయ్య సన్నిధికి

# తండోపతండాలుగా..

**పొరుగు జిల్లాల నుంచి తరలి వస్తున్న భక్తులు.. వీధులన్నీ కిటకిట**

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ గణేశ్‌ని దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ అదే విధంగా ప్రతిష్టాత్మక లడ్డూ వేలంలో ప్రఖ్యాతి గాంచిన బాలాపూర్ బొజ్జ గణపయ్యను సేవించడానికి ప్రజలు భారీ ఎత్తున తరలివస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలకు హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల నుండే కాకుండా వివిధ జిల్లాల నుండి ప్రజలు భారీ సంఖ్యలో తరలివస్తుండడం విశేషం. ఉత్సవాలు ప్రారంభమైన గత బుధవారం నుండి ఇప్పటి వరకు లక్షల మంది భక్తులు గణేషుని దర్శనం కోసం రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో బాలాపూర్ గ్రామ పుర వీధులు భక్తులతో కిక్కిరిసి పోతున్నాయి. ఉదయం నుండి రాత్రి వరకు ఇసుక వేస్తే రాలనంత జనం ఉంటున్నారు. ఈ సారి భువనగిరి స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయం తరహాలో బాలాపూర్ వినాయక భారీ మండపాన్ని ఏర్పాటు చేయడంతో ప్రజలు తిలకించడానికి ఆసక్తి కనబరిచారు. గత శని, ఆదివారాల్లోనైతే భక్తుల తాకిడితో బాలాపూర్ జనసంద్రమైంది. ప్రతి రోజు జనం తండోపతండాలుగా రావడంతో బాలాపూర్‌లో మహా జాతర వాతావరణం తలపిస్తున్నది. దీంతో పోలీసు అధికారులు భారీ బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేశారు.

## బాలలకు పుస్తకాలను అందుబాటులోకి తేవాలి

**బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** బాలలకు సంబంధించిన పుస్తకాలను విరివిగా అందుబాటులో తీసుకురావాలని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయాన్ని చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి సందర్శించారు. కార్యక్రమ ముఖ్యాంశాలు గ్రంథాలయంలో బాలలకు అందుబాటులో ఉన్న పుస్తకాలు, సౌకర్యాలు, వసతులు గురించి నగర గ్రంథాలయ మిగతా 3లో

# సుందరీకరణ సోకిదేనా!

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** మహా నగరాన్ని ప్రపంచస్థాయిలో సుందరీకరిస్తున్నామని గొప్పలు చెప్పుకునే గ్రేటర్ పాలకులకు ప్రధాన, అంతర్గత రహదారులు సవాల్ విసురుతున్నాయి. సుందరీకరణ సంగతి దేవుడెరుగనీ, అడుగునా గుంతలతో నడ్డి విరగ్గొడుతున్న రోడ్లపై ప్రయాణం సాఫీగా సాగితే చాలని నగర వాసులు కోరుతున్నారు. రహదారుల అభివృద్ధికి కోట్లు ఖర్చు చేస్తున్నామని కాకిలెక్కలు చూపిస్తున్న అధికారులు, పాలకుల ధోరణిని వాస్తవ పరిస్థితులు వెక్కిరిస్తున్నాయి. రహదారుల మరమ్మతుల ప్రక్రియ ప్రహసనంగా మారుతుండటమే ఈ పరిస్థితికి కారణం. వివిధ చోట్ల దాదాపు 15వేల గుంతలను గుర్తించామని, వీటిలో పదివేల గుంతలను పూడ్చామని అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తే ఎక్కడా రహదారులకు ఆ సొబగులు కనిపించడంలేదు. చిన్నపాటి వర్షానికే పూడ్చిన గుంతలు అగాధాలుగా మారుతున్నాయి. రోడ్ల అభివృద్ధి పేరుతో కేటాయిస్తున్న నిధుల వినియోగం తీరుపై విజిలెన్స్ శాఖ చిత్తశుద్ధితో దృష్టిసారిస్తే గుంతల పూడిక లెక్కల్లో అసలు బొక్కలు బయటపడతాయని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నగరంలో రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. అడుగడుగునా గుంతలు పడి ప్రయాణికుల నడ్డి విరగ్గొడుతున్నాయి. నగరంలో గోతులు లేకుండా చర్యలు తీసుకున్నామని, ఎక్కడైనా ఉన్నట్టు చూపిస్తే ఒక్కో గొయ్యికి రూ. వెయ్యి చొప్పున నజరానా అందజేస్తామని కొంతకాలం కిందట అధికారులు సవాల్ విసిరారు. కాని నేడు గోతులు లేని రోడ్డు ఒక్కటైనా ఉందా అని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. రోడ్ల విధ్వంసంతో



నరక ప్రాయంగా నగర రహదారులు

నిర్మాణం, నిర్వహణ కోసం యేటా రూ.400 కోట్లు ఖర్చు

10వేల గుంతలు పూడ్చామని కాకిలెక్కలు

వరుస వర్షాలకు అగాధాలుగా మారిన గుంతలు

బయటకు వెళ్లాలంటే ఒళ్లు హూనం

చిత్తశుద్ధితో విచారణ జరిపించి అసలు బొక్కలు బయటకు తీయాలని ప్రజల డిమాండ్

రెండు నెలలకే కంకర తేలిన అంబర్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్వీస్ రోడ్డు



ఉప్పల్ భగాయత్‌లోని డీమార్టు వద్ద గుంతలమయమైన రోడ్డు దృశ్యం

అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తా శిథిలమైన రోడ్డు

ఒళ్లు హూనం అవడంతోపాటు, వాహనాలు గుల్ల అవుతున్నాయి. గ్రేటర్‌లో 9,103 కి.మీల మేర రహదారులున్నాయి. నిర్మాణం, నిర్వహణ కోసం ఏటా రూ.400 కోట్ల నుంచి 500 కోట్లు జిహెచ్ఎంసి ఖర్చు చేస్తోంది. అయినా రోడ్లది అదే దుస్థితి. నాణ్యత, మన్నికతో సంబంధం లేకుండా పర్సంటేజీలు ప్రామాణికంగా అధికారులు బిల్లులు చెల్లిస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సఖ్యతతో రోడ్ల నివేదికలకు విలువ లేకుండా పోతోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించే ప్రధాన రహదారుల విషయంలో కూడా అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో కాంట్రాక్టర్‌లకు ఇష్టారాజ్యంగా మారింది. ప్రధాన దారులతో పాటు అంతర్గత రోడ్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంటోంది. చిన్నపాటి వర్షానికే రోడ్లు కొట్టుకుపోతున్నాయి. కొన్ని చోట్ల మురుగునీటి మ్యాన్ హోళ్ల వద్ద అడుగు లోతున రోడ్లు కుంగుతున్నాయి. స్ట్రామ్ వాటర్ మ్యాన్ హోళ్ల మూతలు మూణ్నాళ్లకే ముక్కలవుతున్నాయి.

నల్లగండ్ల తెల్లాపూర్, కొండాపూర్ చౌరస్తా, హైటెక్ సిటీలోని కొండాపూర్ శ్రీరామనగర్ కాలనీ ప్రధాన రహదారి, కొండాపూర్ హెరిటేజ్ చౌరస్తా, గచ్చిబౌలి ఏపీ హెచ్బీకాలనీ రోడ్డు, సిటీ సెంటర్ చౌరస్తా, రెడ్ హిల్స్‌లోని నిలోఫర్ రోడ్డు లాంటి ప్రాంతాలలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. నారాపల్లి-ఉప్పల్ చౌరస్తా, బోడుప్పల్, ఫిర్జాదిగూడ, నిజాంపేట, దుండిగల్ మున్సిపాలిటీల పరిధిలోని రోడ్లు, ఉప్పల్ భగాయత్ రోడ్డు, అంబర్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్వీస్ రోడ్డు, అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తా-మురుగునీటి శుద్ధి కేంద్రం రోడ్ల పరిస్థితీ ఇంతే.

# గెలుపు గుర్రాల కోసం వేట

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు రాజకీయ పార్టీల కసరత్తు**

**బరిలో దానంను దింపేందుకు పావులు కదుపుతున్న కాంగ్రెస్ అధిష్టానం**

**సై అంటున్న బిజెపి, బిఆర్ఎస్‌లు**

**నియోజకవర్గ ఓటరు లిస్ట్ విడుదల చేసిన ఇసి**

**మొత్తం ఓటర్లు : 3,92,669 మంది**

**పురుషులు : 2,04,288**

**మహిళలు : 1,88,356**

**పోలింగ్ స్టేషన్లు : 47**



**హైదరాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందడంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ప్రధాన పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. అభ్యర్థి ఎంపికపై దృష్టిసారిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న అవరోధాలను అధిగమించేందుకు సమాలోచనలు చేస్తున్నాయి. జూబ్లీహిల్స్ అంటే రిచ్ ఏరియా అని గుర్తింపు. అక్కడ పాగా వేయాలని అధికార కాంగ్రెస్‌తో పాటు సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్, గ్రేటర్లో తమ బలం నిరూపించుకోవాలని బిజెపిలు ఉప ఎన్నికకు సై అంటున్నాయి. ఈ క్రమంలోనే అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారిస్తున్నాయి. ఇక్కడ ఏ పార్టీ నుంచి ఎవరు సీటు దక్కించుకుంటారా అనేది రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయంగా ఆసక్తికరమైన అంశంగా మారింది. ఇక బై ఎన్నికల కోసం కసరత్తు చేస్తున్న ఎన్నికల సంఘం నియోజకవర్గంలో ఓటర్లపై స్పష్టత ఇచ్చింది. ఈమేరకు సమ్మరీని విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నియోజకవర్గ ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేసింది. అయితే, జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు వెల్లడించారు. వీరిలో పురుషులు ఓటర్లు రెండు లక్షలు, మహిళ ఓటర్లు లక్షా 88 వేలకు పైచిలుకు ఉన్నారు. ఈనెల 17వ తేదీ వరకు ఫిర్యాదులు అభ్యంతరాలను తెలియజేయాలని ఎలక్షన్ కమిషన్ నోట్ విడుదల చేసింది.

### హస్తినకు చేరిన కాంగ్రెస్ అభ్యర్థి వ్యవహారం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో తలెత్తిన ఉపెన్నిల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపికకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రస్తుత ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను బరిలో నిలిపేందుకు ఆలోచనలు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర అధినాయకత్వం చేసిన ఈ ఆలోచనలను ఢిల్లీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో వ్యవహారం కోర్టు దృష్టికి వెళ్లడం, ఇటీవల స్పీకర్ ఆయా ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. అయితే మిగిలిన ఎమ్మెల్యేలతో పోలిస్తే దానం నాగేందర్ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది.

బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేగా గెలుపొందిన దానం నాగేందర్ తదనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ పార్టీ బీఫారంపై ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. కాగా తాజా పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ బీఫారంపై బరిలో నిలవడంతో సాంకేతికంగా దానం చిక్కుల్లో పడ్డారు.

ఒకవేళ స్పీకర్ చర్యలు తీసుకొంటే దానం నాగేందర్ అనర్హత వేటు నుంచి తప్పించుకోవడం కష్టమని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఈ క్రమంలోనే దానం నాగేందర్‌ను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రానున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అభ్యర్థిగా నిలిపాలని భావిస్తున్నారు. దానం నాగేందర్ ఎంట్రీ కోసమే జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున గత ఎన్నికల్లో పోటిపడిన, ఈ ఎన్నికల్లో ఆశావాహుడిగా ఉన్న క్రికెటర్ మహ్మద్ అజహరుద్దీన్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించారనే వాదనలు వినిపిస్తున్నాయి. దానం ఎన్నో ఏళ్లుగా ఖైరతాబాద్‌తోపాటు జూబ్లీ హిల్స్ నియోజకవర్గ ప్రజలకు సైతం అందుబాటులో ఉన్నారు. మైనార్టీలతో ఆయనకు ప్రత్యేక అను బంధం ఉండటం, నియోజకవర్గంలో దాదాపు లక్ష మందికిపైగా మైనార్టీ ఓటర్లు ఉండటంతో అధిష్టానం సైతం ఈ దిశగా దానంతో సైతం చర్చించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఖైరతాబాద్ నియో జకవర్గంలో సైతం గెలుపు గుర్రాన్ని నిలిపి కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రెండు సీట్లను వేసుకోవాలనే ఆలోచన చేస్తున్నారు.



తెలంగాణ రాష్ట్ర లంబాడి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న భూక్యసంజీవ్‌నాయక్, ఇతర రాష్ట్ర లంబాడిత సేన నేతలు

### లంబాడీల హక్కుల సాధన కోసం

# సంఘటిత పోరాటం

**భవిష్యత్ కార్యాచరణపై 4న బంజారా భవన్‌లో ఐక్య సమావేశం**

**లంబాడీలను ఎస్‌టి జాబితా నుంచి తొలగించాలన్న కుట్రలను భగ్నం చేస్తాం**

**తెలంగాణ రాష్ట్ర లంబాడి సంఘాల జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కాంగ్రెస్ మాజీ ఎంపీ సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్లు సుప్రీంకోర్టులో వేసిన కేసుతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం ఉందా? లేదా అనే అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తమ వైఖరిని ప్రకటించాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్, మాజీ ఎంపీ రవీంద్రనాయక్, రిటైర్డ్ ఐజీ జగన్నాథరావు, ప్రొఫెసర్ అశోక్లు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర లంబాడి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో లంబాడీల రిజర్వేషన్ వాస్తవాలు కుట్రలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు హుస్సేన్ నాయక్ ఆధ్యక్షతన జరిగిన సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి లంబాడీల పాత్ర ఎంతో ఉందన్నారు. నేడు ఆ పార్టీలో కొనసాగుతున్న సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ లంబాడీలు ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వేసిన కేసును వెంటనే కాంగ్రెస్ పార్టీ ఉపసంహరింపచేయాలని, లేనిపక్షంలో రాష్ట్రంలోని లంబాడీలంతా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తారని హెచ్చరించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కుట్రలను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన భవిష్యత్ కార్యాచరణ కోసం ఈ నెల 4న నగరంలోని బంజారా భవన్లో లంబాడీ సంఘాలన్ని సమావేశం కానున్నాయన్నారు. లంబాడీలు నిజాం పాలన నుంచి తెలంగాణలో ఉన్నారని, నాటి జనాభా లెక్కల్లో ఇది స్పష్టంగా ఉందన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు రాజకీయ పార్టీలు తెరవెనుక కుట్ర చేస్తున్నాయని వాటిని ఎదుర్కోవడానికి రాష్ట్రంలోని లంబాడీలంతా ఏకమై ప్రతిఘటించాలన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీనే ప్రయత్నాన్ని కలిసి కట్టుగా ఎదుర్కొంటామన్నారు. లంబాడీలు ఎస్టీలు కానేకావద్దని దురభిప్రాయం తీసుకువచ్చేందుకు రాజకీయ కుట్ర అన్నారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్డికి ప్రధాన అనుచరుడని, సోయం బాబురావు ఇటీవల కాంగ్రెస్ చేరడంతో వారిద్దరు కలిసి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. లంబాడీల హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడమన్నారు. గిరిజన తెగలందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాంనాయక్, రాజేష్నాయక్, వెంకటేష్ చౌహన్, కల్యాణ్నాయక్, గణేష్నాయక్, సంవత్నాయక్, రవినాయక్, నామా నాయక్, శంకర్నాయక్, శ్రీనునాయక్, ప్రవీణానాయక్, శోభనానాయక్ తదితరలు పాల్గొన్నారు.

## గేమ్ నిర్వాహకులతోనే గేమ్

**ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లోనూ పంగనామాలు**

**ఓడిపోతే బోనస్.. గెలిస్తే అదనపు డబ్బు**

**కొత్త ఫోన్ నంబర్లు, బ్యాంక్ ఖాతాలతో రీ ఎంట్రీ ఇచ్చి బురిడీ**

**ఆటపై పట్టుసాధించి రూ.కోట్లు కొల్లగొడుతున్న కేటుగాళ్లు**

**8 మంది అరెస్ట్.. రూ. 29 లక్షలు స్వాధీనం**

**టాస్క్‌ఫోర్స్‌అడిషనల్ డిసిపి అందె శ్రీనివాస్ వెల్లడి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** నిషేధిత ఆన్‌లైన్ క్యాసినో గేమ్‌లు ఆడటమే కాకుండా, గేమ్ నిర్వాహకులకే పంగనామాలు పెట్టి డబ్బు సంపాదిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు పోలీసులు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 10 మంది సభ్యులు ఒక ముఠాగా ఏర్పడి, తమ తెలివి తేటలతో గేమ్ నిర్వాకులను బురిడీ మిగతా 3లో



వార్షిక అలుమినీ అవార్డులను అందజేస్తున్న డిజిపి జితేందర్

## సైబర్ నేరాలే ఎక్కువయ్యాయి: డిజిపి జితేందర్

**త్రిపుల్‌ఐటిలో నూతన సైబర్ మంథన్, వ్యూహా ల్యాబ్స్ ఆవిష్కరణ**

**గచ్చిబౌలి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** సాంప్రదాయ నేరాల కంటే నేడు సైబర్ నేరాలే ఎక్కువయ్యాయని, తెలంగాణ రాష్ట్రంలో నమోదవుతున్న పోలీసు కేసుల్లో సైబర్ నేరాల శాతం గణనీయమని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(త్రిపుల్‌ఐటి) 28వ వార్షికోత్సవ వేడుకలకు మంగళవారం డిజిపి జితేందర్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టిజిసిఎస్‌బి) డైరెక్టర్ శిఖా గోయల్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా త్రిపుల్ ఐటిలో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ మేనేజిమెంట్ ఆండ్ నెక్స్ట్ జెన్ టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ నెట్‌వర్క్ సెంటర్ 'సైబర్ మంథన్', టిజిసిఎస్‌బి సైబర్ ఇన్నోవేషన్ ల్యాబ్ 'వ్యూహా ల్యాబ్'ను డిజిపి మిగతా 3లో

## వెంటాడుతున్న కరెంటు కాట్లు

**విద్యుత్ స్తంభం పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి**

**భారీ గణనాథుని విగ్రహం తరలిస్తుండగా**

**కేబుల్ అడ్డుపడి ఒరిగిపోయిన స్తంభం**

**నాచారం, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** నగరంలో పౌరులకు విద్యుత్ గండాలు వదలడం లేదు. ఇటీవల గణేశ్ ఉత్సవ ఏర్పాట్ల నేపథ్యంలో దాదాపు ఎనిమిది మంది విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజాగా నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి స్కూటర్‌పై వెళ్లుతుండగా అక స్మాత్తుగా విద్యుత్ స్తంభం మీద పడి బలితీసుకున్న విషాద ఘటన చోటు చేసు కుంది. పోలీసుల కథనం ప్రకారం. స్థాని కులు కొందరు నాచారం వీఎస్‌టీ కాలనీ నుం చి కాప్రా చెరువుకు 16 అడుగుల భారీ గణ నాథుడిని రాత్రి తరలిస్తున్నారు. కొద్ది దూ రం వైపు వెళ్లిన తరువాత విగ్రహం పైభా గం ఇంటర్ నెట్ కేబుల్‌కు తగిలింది. దీంతో తుప్పుపట్టిన విద్యుత్ సంభంపై కేబుల్ బలంగా లాగినట్లు కావడంతో స్థంబం కిందపడిపోయింది. అదే సమయంలో అక్కడి నుంచి కార్తికేయనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సాత్విక్(25) తన స్కూటర్‌పై ప్రయాణిస్తుండగా తుప్పు పట్టిన మిగతా 3లో



మృతి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

## హిమయత్ సాగర్‌లో దూకి యువకుడి ఆత్మహత్య

**అత్తాపూర్ సెప్టెంబరు2,ప్రభాతవార్త :** హిమాయత్ సాగర్ జలాశయంలో ఓ యువకుడు దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం...రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లి హ్యాపి హోమ్స్ కాలనీకి చెందిన ఆరిఫ్ మంగళవారం రాపిడో మోటార్ సైకిల్‌ను బుక్ చేసుకొని హిమాయత్ సాగర్‌కు చేరుకున్నాడని అనంతరం అందరూ చూస్తుండగానే జలశయంలోకి దూకాడు యువకుడికి ఈత రాకపోవడంతో క్షణంలో నీట మునిగిపోయాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో యువకుడి ఆచూకి కోసం గాలిస్తున్నారు. అయితే యువకుడు ఆరిఫ్ కొంతకాలంగా అనారోగ్యం సమస్యలతో బాధపడుతున్నాడని ఆసుపత్రి ఖర్చులు కూడా పెట్టుకొనే స్థోమత లేకపోవడంతో బలవర్మణానికి పాల్పడి ఉండోచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం, కార్పొరేటర్లు మహేశ్వరి

## కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**బేగంపేట సెప్టెంబరు 2,ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బేగంపేట డివిజన్ పరిధిలోని 8మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కల్సి బేగంపేట డివిజన్ కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి చెక్కులు పంపిణీ చేశారు. బాలా నగర్ తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు టి.శ్రీహరి తదితరులు ఉన్నారు.



వికసిత్ భారత్ సదస్సులో పాల్గొన్న విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి

## దేశాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్‌ది కీలక పాత్ర

**బేగంపేట సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** భారత దేశ అభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ ప్రముఖ పాత్ర పోషించే విధంగా నేటి యువత భాగస్వాములు కావాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఈ.విద్యాసాగర్ అన్నారు. ఈ సదస్సుకు బేగం పేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. పద్మావతి అధ్యక్షత వహించారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ 2047 యువత పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య ఈ.విద్యాసాగర్ మాట్లాడుతూ నేటి యువత ఎన్ఎస్ఎస్‌లో చేరి కీలక భూమిక పోషించాలన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రతిభా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో డా.నర్సింహులు, డా.సరిత, డా.కె.వెంకటేశ్వర్లు, డా.రవితేజ, డా.మధుకర్‌రావు, డా.ప్రసన్నలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

## చిరు వ్యాపారుల సంక్షేమానికి చర్యలు

**నార్సింగి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :** చిరు వ్యాపారుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమి షనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్‌లోని వీధి విక్రయదారులందరికి వంద రోజుల ప్రణాళికలో భాగంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. చిరు విక్రయదారులంతా తమకు కేటాయించిన స్థలంలో మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిఐజి సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని, నెలవారి టివిసి సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆత్మ నిర్భర్ నిధి పథకంలో గుర్తించిన వ్యాపారులందరికి రుణాల మంజూరు, రుణాల చెల్లింపు, డిజిటల్ ఆన్ బోర్డింగ్ శిక్షణ శిబిరం నిర్వహణ, గుర్తింపు కార్డులు జారీ చేయడం, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు తెరువడం, పిఎం జెజెబిఐ, పిఎం ఎస్‌బిఐ పతకాల బీమా, ఆర్థిక, అక్షరాస్యతపై సమీక్షలు నిర్వహించారు. సమావేశంలో కన్వేయర్ శ్రీలత, టౌన్‌ప్లానింగ్ అధికారి రాకేష్, డాక్టర్ దివిజ, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శివభార్గవశర్మను వైదికరత్న బిరుదుతో సత్కరిస్తున్న దైవజ్ఞశర్మ, ప్రకాష్, లలిత తదితర అతిథులు

## కన్నులపండువగా నృత్యనీరాజనం

**రవీంద్రభారతి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో భారతీయ శాస్త్రీయ నృత్యనీరాజనం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా కళాకారుల నృత్యవిన్యాసాలు సభికులను ఆకట్టుకున్నాయి. సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ, సంస్థ అధ్యక్షుడు, జానపదగాయకుడు, రచయిత, నటుడు డా. చేరాల ప్రకాష్, ప్రధాన కార్యదర్శి చేరాల లలిత, ప్రముఖ వేదపండితుడు కెవిఆర్.శాస్త్రి తదితరులు వివిధరంగాల్లోని పలువురు ప్రముఖులను ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా మర్తితులసి శివభార్గవశర్మను ఘనంగా సన్మానించి పురోహిత వైదికరత్న బిరుదుతో ప్రదానం చేశారు. భార్గవశర్మ ఈ బిరుదు తన బాధ్యతను, నిష్ఠాగరిష్టలను మరింత పెంచిందన్నారు.

## అత్యాచార నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష

**గచ్చిబౌలి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** మాయమాటలతో నమ్మించి బాధితురాలిపై అత్యాచారం చేసిన నిందితుడికి ఎల్బీనగర్ కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. జైలు శిక్షతో పాటు 5100 జరిమానా, బాధితురాలికి 2లక్షల పరిహారం అందించాలని తీర్పు చెపి ్పంది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో చోటుచేసుకున్న కేసుపై ఎల్బీనగర్ కోర్టు తీర్పు వెల్లడించింది. స్వాగత్ కుమార్ భోయ్(34) అనే వ్యక్తి బాధితురాలికి మాయ మాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలు సంవత్స రాల పాటు అత్యాచారం చేశాడు. బాధితురాలు పెళ్లి కోసం ఒత్తిడి తేవడంతో మరో యువతిని పెళ్లి చేసుకునేందుకు నిందితుడు ప్రయత్నించడంతో పాటు బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలు 2017లో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ కేసుపై విచారించిన ఎల్బీనగర్ 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జీ ఎం.వాణీ తాజాగా తుది తీర్పు వెల్లడించారు. నిందితుడు స్వాగత్ కుమార్‌కు 20 సంవత్సరాల జైలు శిక్ష, 5100 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడిం చారు. దీంతో పాటు బాధితురాలికి 2లక్షల పరిహారం అందించాలని తీర్పునిచ్చారు. ఈ కేసులో పక్కాగా అధారాలను సమర్పించిన గచ్చిబౌలి పోలీసులను కోర్టు అభినందించింది.

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

**అడ్డగుట్ట, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** మారేడ్‌పల్లి మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని మారేడ్‌పల్లి నూతన తహశీల్దార్ హెచ్చరించారు. ల్యాండ్ బ్యాంకింగ్ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ప్రభుత్వ ఖాళీ భూములను ఎవరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వ స్థలాలను ఎవరైనా కబ్జా చేస్తే ఎంతటి వారినైనా సహించేది లేదన్నారు.

# విలువలతో కూడిన జీవన విధానాన్ని నేర్పండి

### మహా సహస్రావధాని డాక్టర్ గరికిపాటి నరసింహరావు



సభలో పాల్గొన్న గరికిపాటి నరసింహ రావు, ఎంపి ఈటల రాజేందర్

**నిజాంపేట్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ హరితవనం కాలనీలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి ్మ సుబ్బారావు ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, మహా సహస్రావధాని డాక్టర్ గరికిపాటి నరసింహ రావు ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గరికిపాటి వారి ప్రవచనామృత ధారలతో తన్మయత్వానికిలోనై బాచుపల్లి ప్రజానీకం పులకించిపోయారు. కలియుగంలో నేటి సామాజిక స్థితిగతులను జీవన విధానాలను వేల సంవత్సరాల క్రితమే మన మహర్షులు దూర దృష్టితో పొందు పరిచారని చెప్పారు. హిందూ ధర్మాన్ని కాపాడుకుంటూ భావితరాలకు విలువలతో కూడిన జీవన విధానాన్ని పాటించేందుకు ప్రతి ఇంట తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు, తల్లిదండ్రులు కొంత సమయం కేటాయించాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు సభ్యులు ఈటల రాజేంద్ర మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఎంతో ఆదర్శవంతమైనదన్నారు. నేటి యువతరం ప్రాశ్చాత్య దేశాల జీవన విధా నాన్ని అలవర్చుకుంటూ పబ్బులకు క్లబ్బులకు వివిధ రకాల దురలవాట్లకు బానిసలై మన కుటుంబ వ్యవస్థను నిర్వీర్యం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సుమారు రెండువేల పైచిలుకు ప్రజలు హాజరయ్యారని వారందరికీ హరితవనం కాలనీ, కేఆర్సిఆర్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

# నేత్రపర్వంగా చారిత్రాత్మక కళావైభవం



రసబివా చారిత్రాత్మక కళాప్రదర్శనల్లో పద్మశ్రీ అవార్డు గ్రహీతలు ఆనందశంకర్ జయంత్, అరుణ మొహంతిలు

**రవీంద్రభారతి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ సాంస్కృతికశాఖ ఒడిస్సా డ్యాన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రసబివా శీర్షికన చారిత్రాత్మక కళావైభవ ప్రదర్శన నేత్రపర్వం కావించనుంది. భారతీయ వారసత్వ కళాసంపదను సజీవంగా ఉంచుతూ సంప్రదాయాలను గౌరవించే మధుర క్షణాలు శాశ్వత జ్ఞాపకాలుగా మలిచేందుకు కళ సంస్కృతి ద్వారా ఒక అసాధారణ ప్రయాణంలో భాగంగా శంకరానంద కళాక్షేత్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గురు ఆనందశంకర్ జయంత్-బృందంచే స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజుపై మణ్యంవీరుడు అల్లూరి సీతారామరాజు; ఒడిస్సా డ్యాన్స్ అకాడమీ భువనేశ్వర్ ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గురు అరుణ మొహంతి-బృందంచే భగవద్గీత దివ్యసందేశం గీతా మహాత్మ్యం జాతీయ కళావేదిక రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో 4వ తేదీ గురువారం రాత్రి 6 గంటల నుండి ప్రదర్శింపబడతాయని, అధికసంఖ్యలో కళాప్రేమికులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ప్రదర్శనలను ఆశాంతం తిలకించి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

**దుండిగల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** ఓ వలస కార్మికుడు మృతిచెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాపన్‌దాస్ (23) బతుకుదెరువు కోసం కొంతకాలం క్రితం నగరానికి వలస వచ్చాడు. దుండిగల్ పురపాలిక సంఘం పరిధి గాగిల్లాపూర్‌లో ఓ రియల్‌సంస్థ నిర్మిస్తున్న విల్లాల ప్రాజెక్ట్‌లో కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతూ అక్కడే కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్డులో నివాసం ఉంటున్నాడు. మంగళవారం బాపన్‌దాస్ మృతిచెంది ఉండడం గమనించి సహ కార్మికులు పోలీసులకు సమాచారం అందించడం ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని గాంధీకి తరలించారు. మృతుడు అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా బావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది. విల్లా ప్రాజెక్ట్‌లో వలస కార్మికుడి మృతిపై భాజపా మేడ్చల్ జిల్లా కార్యదర్శి విఘ్నేశ్వరచారి స్పందించారు. కార్మికచట్టం, హెచ్ఎండిఏ నిబంధనల ప్రకారం కార్మికులకు కనీస వసతులు కల్పించ లేదని, అనారోగ్యం పాలైన ప్రాజెక్ట్ నిర్వాహకులు పట్టించుకోక పోవడంతో కార్మికుడు బాపన్‌దాస్ మృతిచెందాడన్నారు. ఈవిషయమై సమగ్రంగా దర్యాప్తు చేసి కార్మికుడి మృతికి కారణమైన ప్రాజెక్ట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కార్మికుడి కుటుంబానికి నష్ట పరిహారం కింద 30లక్షల రూపాయలు అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర సాగాలి

### మండప నిర్వాహకులకు సిపి ఆనంద్ ఆదేశం



టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలో అవుట్ పోస్టులను ప్రారంభిస్తున్న సిపి సివి ఆనంద్

**మెహిదీపట్నం, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** గణనాధుని నిమజ్జన శోభాయాత్రకు పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని నగర పోలీస్ కమిషనర్ సి.వి ఆనంద్ తెలిపారు. గణేష్ మండప నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నిమజ్జన శోభాయాత్రను త్వరగా పూర్తిచేసుకుని సురక్షితంగా ఇంటికి చేరాలని కోరారు. గణనాధుని శోభయాత్రను పురస్కరించుకొని సోమవారం రాత్రి సౌత్ వెస్ట్ జోన్ డిసిపి పరిధిలోని కుల్సుంపుర, టప్పాచబుత్ర, లంగర్ హౌస్, గోల్కొండ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పలు గణేష్ మండపాలను తనిఖీ చేయడంతో పాటు మండప నిర్వాహకులకు పలు సూచనలు చేసిన అనంతరం మెహిదీపట్నం డిసిపి కార్యాలయంలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ మరియు ఇతర పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.వి ఆనంద్ మాట్లాడుతూ...భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, అసాంఘిక శక్తులు, పిక్ పాకెటర్లు, ఈవ్ టీజర్లు, గొలుసు దొంగతనం వంటి నేరాలను నివారించడానికి పటిష్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. ముందు జాగ్రత్తగా రాత్రిపూట విగ్రహాల వద్ద నిర్వాహకులు లేదా వాలంటీర్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. గణేశ్ విగ్రహాలను త్వరగా నిమజ్జనం చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికపై చర్చించి, మండప నిర్వాహకులకు విగ్రహాలను నిమజ్జనానికి సాధ్యమైనంత త్వరగా బయలుదేరి, క్షేమంగా ఇంటికి చేరుకునేలా చూడాలన్నారు. వర్షాలు పడుతున్నందున నిర్వాహకులు అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిచో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా భక్తులు మరియు ప్రజలు అందరూ పోలీసు వారికి సహకరించాలని కోరారు. ముందుగా కుల్సుంపుర పోలీస్ క్వార్టర్స్‌లో కొత్త క్రికెట్ ప్రాక్టీస్ సౌకర్యాన్ని ప్రారంభించారు.

పోలీసు సిబ్బందిలో క్రీడా స్ఫూర్తిని, అభివృద్ధిని మరియు సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి పిచ్ మరియు నెట్‌తో కూడిన ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగా బౌలీలో ఒక ఔట్ పోస్టును ప్రారం భించారు. సమావేశంలో సౌత్ వెస్ట్ జోన్ డిసిపి జి.చంద్ర మోహన్, ఎస్. బి డిసిపి కె. అపూర్వ రావు, ట్రాఫిక్ డిసిపి ఆర్.వెంకటేశ్వర్లు, ఎం.ఏ. బారి, టాస్క్ ఫోర్స్ అడిషనల్ డీసీపీ ఇక్బాల్ సిద్ధిఖీ, సౌత్ వెస్ట్ జోన్ పరిధిలోని ఏసీపీలు సిఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.



మహంకాళీ డివిజన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

## గణేష్ ఉత్సవాల వేళ పోలీసుల ఫ్లాగ్ మార్చ్

**బేగంపేట సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహంకాళీ డివిజన్ పరిధిలోని మహంకాళీ పోలీసుస్టేషన్, మార్కెట్ పోలీసుస్టేషన్ , రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్ల పరిధిలో బందోబస్తుకు వచ్చిన సిబ్బందితో మంగళవారం సాయంత్రం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌ని క్లాక్ టవర్, 31బస్టాప్, పాలికా బజార్, సుభాష్‌రోడ్డు, జనరల్ బజార్, నల్లగుట్ట ఏరియాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహంకాళీ ఏసీపీ సైదయ్య, మహంకాళీ ఇన్స్‌పెక్టర్ కె.పరుశురాం, డి.ఐ.రంగారెడ్డి. మోండా మార్కెట్ ఇన్స్‌పెక్టర్ రామచందర్, డిఐ బషీర్, రాంగోపాల్‌పేట ఇన్స్‌పెక్టర్ నర్సింగరావు, డిఐ రాజశేఖర్, సెక్టార్ ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## 19న విశిష్ట సేవలకు అవార్డుల ప్రదానం

**సికింద్రాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** ఫిల్మ్, టెలివిజన్ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గుర్తించి సత్కరించడానికి ఎఫ్‌టీపిసి ఇండియా (ఫిల్మ్ టెలివిషన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తున్న గ్రేటర్ ఎక్సలెన్సీ అవార్డ్స్ 2025 ఈ నెల 19న బేగంపేట కంట్రీ క్లబ్‌లో వైభవంగా జరగనున్నాయి. ఈ అవార్డుల వేడుకకు సంబంధించిన పోస్టర్‌ను నేడు హైదరాబాద్ హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అవార్డులు సమాజానికి విశేష కృషి చేసిన వ్యక్తులను ప్రోత్సహించడమే కాకుండా, తదుపరి తరాలకు స్ఫూర్తినిచ్చే వేదికగా నిలుస్తాయన్నారు. ఎఫ్‌టీసిపిసి ఇండియా చేస్తున్న ఈ ప్రయత్నం అభినందనీయమన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎఫ్ టీ పి సి ఇండియా తెలంగాణ మీడియా చైర్మన్ కిరణ్ బెజాడి, మీడియా డైరెక్టర్ మున్నూరు చందులు పాల్గొన్నారు. అవార్డుల ప్రదానోత్సవానికి సినీ, టెలివిజన్, మీడియా రంగ ప్రముఖులు, సామాజిక రంగంలో విశిష్టమైన సేవలందిస్తున్న పలువురు పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు. ఎఫ్‌టీపిసి ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అవార్డులు, హెల్త్, ఎడ్యుకేషన్, ఎన్విరాన్‌మెంట్, సోషియల్ సర్వీస్, బిజినెస్, మీడియా, ఫిల్మ్ టెలివిజన్ వంటి విభాగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వ్యక్తులకు ప్రదానం చేయనున్నారు.

# పిజి గదులకు విద్యుత్ మీటర్లను పునరుద్ధరించాలి

**కెపిహెచ్బి కాలనీ, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** కూకట్పల్లిలోని బాలాజీ నగర్ డివిజన్లోని ఓ పీజీ హాస్టల్ నిర్వాహకుల వింత చేష్టలపై అక్కడ ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తంచేశారు. తాము ఉండగానే తమ రూమ్‌లకు విద్యుత్ మీటర్లను తొలగించారని మండి పడ్డారు. ప్లాట్ నెంబర్ 15-21-6లో ఓనర్ రమేష్ చంద్ర మహేష్ స్థానిక మహిళ హరీషకు హరి శ్రీ మెన్స్ పీజీ హాస్టల్ లీజ్ పద్ధతిలో ఇచ్చారని చెప్పారు. హరీష దగ్గర దాదాపు 40 లక్షల రూపాయలు తీసుకున్న ఓనర్ తిరిగి చెల్లించే క్రమంలో ఇద్దరు మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. దీంతో ఓనర్ కుమారుడైన శశాంక్ మహేష్ కర్కర్ తన పలుకుబడిని ఉపయోగించి విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో పీజీ హాస్టల్ గదులకు సంబంధించిన 13 మీటర్లను తొలగించారని తెలిపారు. దీంతో హాస్టల్‌లో ఉంటున్న 40 మంది విద్యార్థులు, ఉద్యోగులు కరెంటు లేక, నీళ్లు రాక, తినడానికి తిండి లేక ఇబ్బందులు ఎదుర్కొమని వివరించారు. చేసేది లేక తాము ధర్నాకు దిగాల్సి విచ్చిందని పేర్కొన్నారు.

ఈ విషయమై హాస్టల్ నిర్వాహకులు హరీష్ మాట్లాడుతూ స్థానికంగా జరుగుతున్న వివాదం కోర్టు పరిధిలో ఉందని తెలిపారు. అయినప్పటికీ విద్యుత్ శాఖ వారు మీట ర్లను తొలగించడం విడ్డూరంగా ఉందన్నారు.

ఈ విషయమై తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం నిమజ్జనం సందర్భంగా సోమవారం వరకు తమకు టైం కావాలని చెప్పినప్పటికీ ఓనరు విద్యుత్ శాఖ అధికారులు వినకుండా స్థానిక ఏఈ దౌర్జన్యంగా మీటర్లను తొలగించారని ఆమె ఆరోపించారు. వెంటనే మీటర్లను పునరుద్ధరించాలని కోరారు.

# బెయిల్‌పై బయటకు వచ్చి.. మళ్లీ చోరీ

### నిందితుని అరెస్ట్ చేసిన పోలీసులు

**యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** జైలుకి వెళ్ళివచ్చినప్పటికి అతని తీరు మార్చుకోకుండా మళ్ళీ దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుపడ్డ పాత నేరస్తుడు షేక్‌పర్వాజ్(22)ను అల్లాపూర్ పోలీసులు ఓ దొంగతనం కేసులో అరెస్టు చేశారు. అల్లాపూర్ సిఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శివబస్తీలో నివాసం ఉండే మల్లేష్ అనే వ్యక్తి గత నెల 31వ తేది కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి గణేస్ నిమర్జనం కోసం ట్యాంకు బండికి వెళ్ళి నిమర్జనం చేసిన తరువాత మరుసటి రోజు 1వ తేది సెప్టెంబర్ తెల్లవారు జామున 5గం టలకు ఇంటికి వచ్చి చూడగా ఇంటి మెయిన్ డోర్ తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లో అల్మారలో ఉన్న 19 తులాల బంగారు అభరణాలు 25వేల వెండి వస్తువులు రూ.29వేల నగదును ఒక వివో ముబైల్ ఫోరన్ ఒక సామ్‌సంగ్ మొబైల్ ఫోన్ దొంగలించుకొని వెళ్ళి పోయినట్లు గుర్తించారు. ఈవిషయమై అల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డిజిపిసి బాలానగర్ సురేష్ కుమార్, ఎసిపి రవికాంత్‌రెడ్డి వారి ఆదేశాల మేరకు అల్లాపూర్ పోలీసులు, సిసిఎస్ బాలానగర్ పోలీ సులు రంగంలోకి దిగి నిందితుడు అక్కడ వదిలిన ఫింగర్ ప్రింట్స్ ద్వారా పోలీసులు చాక చక్యంగా పాత నేరస్తుడైన షేక్‌పర్వాజ్‌ను అదుపులోకి తీసు కున్నారు. అతనిపై ఇంతకు ముందు అల్లాపూర్ సనత్‌నగర్ మాదాపూర్ ఎస్ఆర్‌నగర్ బేగంపేట్, కెపిహెచ్‌పి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 23 దొంగతనాలు చేసి జైలుకి వెళ్ళి వచ్చాడు.

చివరిసారిగా సూరారం పోలీస్‌స్టేషన్ నుండి దొంగతనం కేసులో జైలుకి వెళ్ళి బేలుపై బయటికి వచ్చాడు. అయినా కూడా నిందుతుడు పద్ధతి మార్చుకోగా మళ్ళి దొంగ తనాలకు పాల్పడ్డాడు. షేక్ పర్వాజ్ నిందుతుడు రాత్రి సమయంలో కాలనీలలో బస్తీలలో తిరుగుతూ తాళం వేసిన ఇంటిని చూచి ఇనుపరాడ్ సహాయంతో ఇంటి తాళం పగుల గొట్టి ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను దొంగలించుకుని వెళ్ళి పోతాడు. ఇలాంటి దొంగతనం కేసులో నింద తుడిని పట్టుకున్నటువంటి అల్లాపూర్ ఎస్వోటి పోలీసులను ఇతర సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## పండుగలు సనాతన ధర్మానికి ప్రతీకలు

### ఎంఎల్ఏ ముఠా గోపాల్

**చిక్కడపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** పండుగలు సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయని ముషీరాబాద్ ఎంఎల్ఏ ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం అడిక్ మెట్ డివిజన్ విద్యానగర్ అచ్యుతరెడ్డి వీధిలో మనోరంజని కళామందిర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ముఠా గోపాల్, బి ఆర్ ఎస్ యువనేత ముఠా జయసింహ, విశిష్ట అతిథిగా బి ఆర్ ఎస్ నేత కె.సురేందర్, అనురాధ సురేందర్, నేత శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతిధులను సత్కరించారు.

## కార్యాలయం సొమ్ముతో ఉద్యోగి పరారీ

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** పనిచేసే సంస్థకు సంబంధించిన సొమ్ముతో పరారైన ఒక ఉద్యోగిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని నికాషి ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి సంస్థలో వరంగల్ జిల్లాకు చెంది కుత్బుల్లాపూర్‌లో నివసిస్తున్న రాకేష్‌రెడ్డి గతేడాది ఏప్రిల్ నుంచి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఎల్ఈడీ టీవీలు, వాషింగ్ మిషన్లు డీలర్లకు విక్రయిస్తుంది. రాకేష్‌రెడ్డి విధుల్లో చేరిన రెండు నెలల తరువాత విధులకు హాజరుకాలేదు. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. సంస్థ విచారణలో భువనగిరికి చెందిన నాగేంద్ర మొబైల్స్, జగద్గిరిగుట్టలోని విక్రం ఎలక్ట్రానిక్స్, గప్పలగూడంలోని మేఘన హోం నీడ్, షాపూర్‌నగర్‌లోని ఆదిత్య ఎలక్ట్రానిక్స్‌ల నుంచి సంస్థకు రావాల్సిన దాదాపు రూ. 93,300 లను రాకేష్‌రెడ్డి వసూలు చేసి సంస్థ ఖాతాలో జమ చేయనట్లు గుర్తించారు. వీటితోపాటు ఒక సెల్‌ఫోన్ సైతం అతనితోపాటు తీసుకెళ్లినట్లు గుర్తించారు. రాకేష్‌రెడ్డి చేసిన మోసంపై సంస్థ ప్రతినిధి ఆర్యన్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం తాగి వాహనం నడిపినందుకు జైలు శిక్ష

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త :** మద్యం సేవించి వాహనం నడిపిన 5మంది యువకులకు న్యాయస్థానం 2 రోజుల జైలు శిక్ష విధించారని మంగళవారం అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తెలిపారు. 18 డిడి కేసులలో రూ. 60,000 జరిమానా విధించినట్టు తెలిపారు. మద్యం తాగి ఎవరూ కూడా వాహనాలు నడపవద్దని కోరారు.



చార్మినార్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

## పాతబస్తీలో శోభాయాత్రలకు పక్కా యేర్పాట్లు

**చార్మినార్,సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** శ్రీ గణేష్ శోభాయాత్రలు కొనసాగే ప్రాంతాలలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అవ సరమైన చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం అధికారులతో కలిసి చాంద్రాయణగుట్ట సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో పర్యటిం చారు. రాజన్నబావి వద్ద నిమర్జనం ఏర్పాట్లపై ఆయన అధికారులతో ఆరా తీశారు. కార్యక్రమంలో చార్మినార్, చాంద్రా యణగుట్ట సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు సరిత, సురేందర్, ఏఎంహెచ్‌లు డాక్టర్ దీప్తి, డాక్టర్ చక్రపాణితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## మాలలను బిచ్చగాళ్ళుగా మారుస్తున్నారు

**సైఫాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వం కాలరాస్తూ, ఎస్సీ వర్గీకరణ చేస్తూ మాలలను బిచ్చగాళ్ళుగా మారుస్తున్న సమయంలో అసెంబ్లీలో నోరువిప్పకుండా బానిసలుగా చెవులు, నోరు మూసుకొని కుర్చున్న మాల ప్రజా ప్రతినిధులపై భౌతిక దాడులు చేస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.పబ్బతి శ్రీకృష్ణ హెచ్చరించారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లో ఆయన మాల మహానాడు గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా ఎ.ఎన్. వినయ్‌కుమార్‌ను నియమించిన సందర్భంగా మాట్లాడారు. తెలంగాణలో మాల కుటుంబాలపై దాడులు జరిగినా, ఎస్సీ నిధులు, సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించిన మాల ప్రజా ప్రతినిధులు మాట్లాడటం లేదని, ఉప ముఖ్యమంత్రితోసహా అందరూ బ్రతికి ఉన్న జీవచ్ఛావాలని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా వారు బహిరంగంగా పోరాటం చేస్తున్న మాలలకు మద్దతు ఇవ్వాలని, లేదంటే భౌతిక దాడులు తప్పవని హెచ్చరించారు. కొంతమంది దొంగలకు డబ్బులు ఇచ్చి మాలల ఓట్లు ఇతర పార్టీలకే మళ్ళించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గిరిజాశంకర్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినయ్‌కుమార్‌కు నియామపత్రాన్ని అందజేస్తున్న శ్రీకృష్ణ



అన్నదాన కారక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు

## ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని శ్రీలక్ష్మీగణపతి పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు అన్నారు. మంగళవారం ఆలయంలో గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని సంఘసేవకుడు కొత్తరఘు కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బండారి నవీన్, జె.శిశుకుమార్, ఎం.రాజేష్, డి.భానుచందర్, జి.భాగ్యలక్ష్మి, జి.సాయికీర్త్, గిరిబాబు, గుర్రం దినేష్, బి.నవీ న్‌కుమార్, పి.సురేశ్‌యాదవ్, జి.గజానంద్, ఎం.గణేష్, జి.లలిత, ఎ.రామకృష్ణ, జి.శ్రీనివాస్, కె.శివకుమార్, సిహెచ్. శ్రీనివాస్‌గౌడ్, గుండ్ల గజానంద్, ఆలయం అర్చకులు గోపాలా చార్యులు, పి.శ్రీధరాచార్యులు, రామాచార్యులు, ఆలయం సిబ్బంది పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు : గజ్జెల నాగేశ్

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎవరు నమ్మవద్దని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ తెలిపారు. బిఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కంటోన్మెంట్ 2వ వార్డు అన్నానగర్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బిఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి జలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ సదర్భంగా గజ్జెల నాగేశ్ మాట్లాడుతూ ఘోష్ కమీషన్ ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందన్నారు. కేసిఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఓర్వలేక కాంగ్రెస్,బిజెపి ప్రభుత్వాలు కుట్రపన్నుతున్నాయన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు మెంబర్ అనితనా ప్రభాకర్,మాజీ కో. .ఆప్షన్ మెంబర్ నర్సింహ్మా ముదిరాజ్, బిఆర్ఎస్ నాయకులు పనస సంతోష్, సాయి కిరణ్, అశోక్, దేవులపల్లి శ్రీను, నరేశ్, కిరణ్, యాదగిరి, ధన్‌రాజ్,కనకయ్య, విజయ లక్ష్మి,ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

### ఓయూ వద్ద మూత్రవిసర్జన చేయొద్దన్నందుకు..

## సెక్యూరిటీ సిబ్బందిపై దాడి

**తార్నాక, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** ఓ.యూ ప్రాంగణం వద్ద మూత్ర విసర్జన వద్దన్నందుకు సెక్యూరిటీ సిబ్బందిపై కొంతమంది దాడికి దిగిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఇన్నోవాలో వచ్చిన నలుగురు వ్యక్తులు మూత్ర విసర్జన చేస్తుండగా ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ వద్ద సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న సాయినాథ్ వారిని అడ్డుకునే ప్రయత్నంచేశారు. వారిలో ఒకరు తాను ఐఏఎస్‌ను అంటూ సాయినాథ్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో తన ఇంచార్జి నర్సింహులుకు ఈ విషయం ఫిర్యాదు చేయటంతో అతను కూడా ఘటనా స్థలలానికి చేరుకున్నాడు.

ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. బోడా దేవిలాల్, జనార్ధన్, తులసీరామ్, ధన్ సింగ్ బోడా అనే వ్యక్తులు సెక్యూరిటీ సిబ్బందిపై కర్రతో దాడికి యత్నించారు. ఉద్యోగుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు నిందితుల్ని అరెస్టు చేశారు. వీరు గతంలో కూడా ఓ.యూలో మద్యం సేవించడం, మహిళలతో అనుచితంగా ప్రవర్తించడం, భద్రతా సిబ్బందితో గొడవ పడటం, దాడి చేయడంతో పాటు తాను కలెక్టర్‌ను అంటూ తప్పుడుగా చెప్పుకునేవాడని పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బాలల పుస్తకాలను అందుబాటులోకి తేవాలి
(మొదటి పేజీ తరువాయి)

సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం కల్పించిన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలల చదువుకు ఉపయోగపడే పుస్తకాల లభ్యత, పిల్లలకోసం ప్రత్యేక విభాగం, పఠన వాతావరణంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్రెయిలీ సెక్షన్ పరిశీలించారు గ్రంథాలయంలో విద్యార్థులు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డితో పాటు కమిషన్ సభ్యులు గోగుల సరిత, ప్రేమలత, అగర్వాల్, బి. వచన్ కుమార్, షబానా కమిషన్ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంల ప్రథమ శ్రేణి గ్రంథపాలకురాలు చంద్రకళ సీతామహాలక్ష్మీ, అవినాష్, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, బొల్లం మహేందర్ కృష్ణారెడ్డి, పి.డి. మహేష్, అనిల్ తదితరులుఉద్యోగులు పాల్గొన్నారు.

## వెంటాడుతున్న కరెంట్ కాట్లు
(మొదటి పేజీ తరువాయి)

ఇనుప విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా విరిగి అతనిపై పడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అతనిని గాంధీకి తరలించగా అతను అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. అధికారుల నిర్లక్ష్యం పర్యవేక్షణ కారాణంగా తుప్పుపట్టిన స్థంబం విరిగిపడి సాత్విక్ మృతి చెందాడని ఇందులో విద్యుత్ శాఖ, జీహెచ్‌ఎంసీ అధికారుల వల్ల వృతి చెందాడని స్థానికులు, మృతుడి కుటుంభ సభ్యులు ఆరోపించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ధార్యాప్తు చేస్తున్నారు.

## సైబర్ నేరాలే ఎక్కువ అయ్యాయి
(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నా తెలంగాణలో మాత్రం ప్రోయాక్టివ్ పోలీసింగ్ ద్వారా సైబర్ నేరాలను 11శాతం తగ్గించగలిగామని అన్నారు. దీంతో పాటు దేశ వ్యాప్తంగా సైబర్ నేరాల కారణంగా ఆర్థిక నష్టాలు పెరుగుతుంటే తెలంగాణలో మాత్రం 20శాతం ఆర్థిక నష్టాలు తగ్గాయని తెలిపారు. ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సైబర్ మంథన్, వ్యూహ్ ల్యాబ్ పరిశోధన కేంద్రాలు అకడమిక్ సంస్థలు, స్టార్టప్‌లు, ఇన్నోవేటర్లకు ఉపయోగపడడమే కాకుండా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల పోలీసులకు మేలు చేస్తాయని అన్నారు. ట్రిపుల్‌ఐటి దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఒకటని, ఎంతోమంది మేధావి విద్యార్థులకు ట్రిపుల్‌ఐటి కలల గమ్యమని తెలిపారు. భవిష్యత్తులో ట్రిపుల్‌ఐటి నుంచి మరిన్ని సరికొత్త ఆవిష్కరణలు, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ ప్రపంచంలోనే వేగంగా పెరుగుతున్న నేరం సైబర్ నేరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 11.9 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల నష్టం సైబర్ మోసాల కారణంగా జరిగిందని తెలిపారు. అమెరికా, చైనా తరువాత మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థతో ఇది సమానమన్నారు. 2024లో భారతదేశం సైబర్ మోసాల కారణంగా 24వేల కోట్ల నష్టాన్ని చవిచూసిందని, అందులో తెలంగాణ వాటా 1,900 కోట్లు అని అన్నారు. ప్రతిరోజు సగటున 250 కొత్త కేసులు నమోదవుతున్నాయని, దాదాపు 5కోట్ల వరకు నష్టాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా చూస్తే తెలంగాణలో 11శాతం తగ్గుదల నమోదైందని, ఇన్నోవేషన్, సమన్వయంతో సైబర్ నేరాలను నియంత్రించవచ్చని నిరూపితమైందన్నారు. తెలంగాణ టి4సి(తెలంగాణ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్) దేశ వ్యాప్తంగా ఉన్న ఐ4సికి మోడల్‌గా నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటి హైదరాబాద్, టిజిఎస్‌బిలు అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. అనంతరం పలు విభాగాల్లో విశేష కృషి చేసిన వారికి ట్రిపుల్‌ఐటి వార్షిక అలుమినీ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ కే.శుక్లాతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్లాంబ్లింగ్ గేమ్ నిర్వాహకులతోనే 'గేమ్'
(మొదటి పేజీ తరువాయి)

కొట్టించి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఎస్ఆర్‌నగర్‌లోని నాగార్జున స్కూల్ సమీపంలో స్థానిక పోలీసులతో కలిసి సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించి ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహిస్తున్న ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన సూత్రధారులు రాజేష్, అస్లాంలు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లాకు చెందిన రాజేష్, అస్లాంలు ఇద్దరు హైదరాబాద్‌కు వచ్చి వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ మధ్య ఇద్దరు ఆన్‌లైన్‌లో ఖేలో గేమ్ వెబ్ అప్లికేషన్‌లను గుర్తించారు. అందులో మొబైల్ అప్లికేషన్స్ అయిన ఖేలో స్టార్, ఖేలో 24, ఖేలో ఎక్స్‌ఛేంజ్, ఖేలో స్పోర్ట్స్, విన్ మ్యాచ్‌ల ద్వారా బెట్టింగ్‌లు నిర్వహించేందుకు స్కెచ్ వేశారు. దీని కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన జి.వినయ్, ఎన్.సాయి వర్ధన్ గౌడ్, డి.రాహుల్, డి.జశ్వంత్ తేజ, జోడా వేణుగోపాల్, కోల రామ్, వేపుల ఆకాష్, డి.ప్రణయ్‌లతో కలిసి ఒక ముఠాను ఏర్పాటు చేసుకున్నారు. వీరి ద్వారా సుమారు 239 బ్యాంకు ఖాతాలను సేకరించి ఆన్‌లైన్ క్యాసినో బెట్టింగ్‌లను నిర్వహిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ బ్యాంకు ఖాతాలు సమకూర్చినందుకు రాజేష్, అస్లాంలు ముఠాలోని సభ్యులకు నెలసరి వేతనంతో పాటు కమిషన్లు ఇస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నారు. ఖేలో గేమ్ అప్లికేషన్‌లో క్యాసినో గ్యాంబ్లింగ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ గ్యాంబ్లింగ్ గేమ్‌లో బ్లాక్ అండ్ రెడ్ రంగులు వేసిన బోర్డులో 1 నుంచి 36 వరకు అంకెలు ఉంటాయి. అదే విధంగా గేమ్‌లో రౌలెట్ వీల్ ఉంటుంది. అందులో కూడా బ్లాక్ అండ్ రెడ్ రంగుల మీద అంకెలు ఉంటాయి. ఆ వీల్ తిరుగుతున్న వైపుకు ఎదురుగా బాల్‌ను విసురుతారు. ఆ బాల్ ఏ రంగులో వెళ్లి సంఖ్య మీద ఆగుతుందో ఆ రంగు, సంఖ్య మీద బెట్టింగ్‌లు పెట్టిన వారికి డబ్బులను ఖేలో గేమ్ నిర్వాహకులు చెల్లిస్తారు. ఈ గ్యాంబ్లింగ్ గేమ్‌ను చాలా సార్లు ఆడడంతో గేమ్‌పై పూర్తి పట్టు సాధించిన రాజేష్, అస్లాంలు ఇతరుల ఫోన్ నంబర్లు, బ్యాంక్ ఖాతాలు సమకూర్చుకొని ఒకరు బ్లాక్ మరొకరు రెడ్ కలర్ ఎంచుకొని, పలు నంబర్లపై బెట్టింగ్ పెడుతూ డబ్బు సంపాదిస్తున్నారు. అయితే ఈ ఖేలో గేమ్ నిర్వాహకులు పంటర్‌లను ఆకర్షించేందుకు పరిమిత బెట్టింగ్‌ల వరకు ఓడిపోయిన వారికి కూడా రూ. 10 నుంచి రూ. 15 వేల వరకు బోనస్‌గా ఇస్తుంటారు. ఓడిపోతే బోనస్ కింద డబ్బులు వస్తున్నాయి. గెలిస్తే అది అదనపు ఆదాయంగా కలిసివస్తుంది. ఈ రకంగా గ్యాంబ్లింగ్ అప్లికేషన్‌ను నిర్వహిస్తున్న ఖేలో గేమ్ నిర్వాహకులనే వీరు దోచుకుంటున్నారు. ముఠాలోని 8 మంది సభ్యులను అరెస్ట్ చేసి 18 సెల్‌ఫోన్లు, 13 ఏటీఎం కార్డులు, 3 బ్యాంకు ఖాతాలు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ. 29 లక్షలు ఫ్రీజ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు

# శోభాయాత్రలో విద్యుత్ వైర్లు అడ్డు రావద్దు

### టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ నర్సింహులు



మీరాలం చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (ఆఫరేషన్) నర్సింహులు

**చార్మినార్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** గణేష్ నిమజ్జనం సామూహిక శోభాయాత్ర సందర్భంగా విద్యుత్ విభాగం తరుపున ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని చర్యలు తీసుకున్నామని టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (ఆఫరేషన్) నర్సింహుల తెలిపారు. పాతనగరంలో గణేష్ నిమజ్జనం శోభాయాత్ర జరగనున్న శాలిబండ, ఓల్గా హోటల్ చౌరస్తా, కిల్వత్, లాడ్‌బజార్ చౌరస్తా, కసారట్ట, మూసాబౌలి చౌరస్తా, సిటీ కళాశాల చౌరస్తా ప్రాంతాలలో టిజిఎస్‌పిడి సిఎల్ డైరెక్టర్ (ఆఫరేషన్) నర్సింహులు పర్యటించారు. అక్కడ నుంచి డైరెక్టర్ నర్సింహులు మీరాలం చెరువుకు చేరుకున్నారు. మీరాలం చెరువులో జరగనున్న గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా విద్యుత్ శాఖ తరుపున ఎటువంటి అసౌకర్యం కలగకుండ క్రాష్‌గా ఉన్న విద్యుత్ వైర్లు, కేబుల్ వైర్లను తొలగించటం జరిగిందని తెలిపారు. గణేష్ నిమజ్జనం రోజున విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్‌పిడిసిఎల్ మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు ప్రభాకర్, సౌత్ జోన్ ఇంఛార్జి ఎస్ఈ వెంకన్న, టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్, మీరాలం ఏడిఈ వెంకటేష్ గౌడ్, చార్మినార్ ఏడిఈ మక్సూద్, ఫలకనుమా ఏడిఈ రాజు, చార్మినార్ సిబిడి ఏడిఈ రాజుతో పాటు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

# మృదంగ కళకు గోపాలకృష్ణన్ సేవలు అమోఘం

### పద్మశ్రీ డా.ఎల్లా వెంకటేశ్వరరావు



మృదంగ కళాకారులు వి. గోపాలకృష్ణన్‌కు మృదంగ కళా ప్రవీణ బిరుదు ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** మృదంగ కళకు గోపాలకృష్ణన్ చేసిన ఎంతో గొప్పవని ప్రపంచప్రసిద్ధ మృదంగకళాకారులు పద్మశ్రీ డా.ఎల్లా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో రామానుజ కళా సంస్కృతిక నైపుణ్యాభివృద్ధి సంస్థ, ది మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రసిద్ధ టాప్ గ్రేడ్ మృదంగ కళాకారులు, ఆకాశవాణి విశ్రాంత నిలయ కళాకారులు వి. గోపాలకృష్ణన్ కు మృదంగ కళా ప్రవీణ బిరుదప్రదానం చేసారు. కృష్ణం వందే జగద్గురుం అనే కార్యక్రమంగా జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా డా.ఎల్లా వెంకటేశ్వరరావు పాల్గొని బిరుదును ప్రధానం చేసి ప్రసంగించారు. శ్రీ రామానుజ సంస్థ ఆశయా లను ప్రశంసించారు. గోపాల కృష్ణన్ మృదంగకళకు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. మాజీ కేంద్రమంత్రి వర్యులు సముద్రాల వేణుగోపాలాచారి, ప్రసిద్ధ సంగీత విద్వాంసులు డా. రాఘువాచార్యులు, డా.బి వైద్యనాథన్, మృదంగవిద్వాంసులు డా.డి ఎస్ ఆర్ మూర్తి, డా.బిఎస్. నారాయణన్, డా. సూరి వెంకటేశ్వర్లు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

కూచిపూడి డ్యాన్స్ టీచర్లు మోనిక, గౌతమి, సంగీత గురువు కృష్ణప్రియ, శ్రీదేవిలు నిర్వహణలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు రసరంజకంగా సాగాయి. సంగీత నాట్య కళా సమాహారంగా జరిగిన ఈ వేడుకను సంస్థ వ్యవస్థాపకులు నదాధూర్ అనిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తనకు జరిగిన సత్కారానికి సమ్మాన గ్రహీత డా. జు. గోపాలకృష్ణన్ కృతజ్ఞతలు తెలిపారు.

# కళలకు వెలుగులద్దిన ప్రతిభామూర్తి లక్ష్మీకాంత శర్మ

### ప్రముఖ గాయకుడు డిఎస్‌వి.శాస్త్రి



నాటక రచయిత చక్రాల లక్ష్మీకాంతశర్మకు జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** సహస్ర చంద్రోదయాలు చూసిన కృషీవలుడు, కళలకు వెలుగులద్దిన ప్రతిభామూర్తి చక్రాల లక్ష్మీకాంత అని కేంద్రీయ విశ్వవిద్యా లయం నృత్యశాఖ ప్రముఖ గాయకుడు డి ఎస్ వి అన్నారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో మానస ఆర్ట్స్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి, కవి రఘుశ్రీ నిర్వహణలో ప్రముఖ రచయిత, దర్శకులు చక్రాల లక్ష్మీకాంత రచించిన శ్రీ రామ సుగ్రీవ మైత్రి పద్యనాటకం ప్రదర్శన జరిగింది. కుందుర్తి వెంకటకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి ఎస్ వి శాస్త్రి హాజరై నాటకాన్ని ప్రదర్శించిన కళాకారులను సత్కరించి, నాటక రచయిత చక్రాల లక్ష్మీకాంతశర్మకు జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసి పేరిణి నాటక కళాశిరోమణి బిరుదుతో సత్కరించారు. సభలో చిట్టా వెంకట శివప్రసాద్, ముదిగొండ విశ్వేశర శర్మ, జొన్నలగడ్డ జగన్మోహన రావు, మల్లాది భాస్కర్, డాక్టర్ అంబల్ల జనార్దన్, బి. రామ్మూర్తి, ఉమ్మడిశింగు రాఘవరావు, విశ్రాంత న్యాయమూర్తి నేరెళ్ల మాల్యాద్రి, కల్యాణశ్రీ, వార చంద్ర శేఖర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రామ సుగ్రీవ మైత్రి పేరిణి నాటకాన్ని ప్రదర్శించారు. పప్పుల శ్రీనివాస్ సంగీతాన్ని, పరమేష్ ఆహార్యాన్ని అందించారు. రాముడుగా కిషోర్ కుమార్, సీతగా దేవసేన, జి కె ఫణి హనుమంతుడుగా, శూర్పణగా తిరుమల, సుగ్రీవుడిగా రత్నాకర్, మారీచుడిగా భరద్వాజ్, అగస్తుడుగా జి.ఎస్.కుమార్ లు తమతమ పాత్రలను అద్భుతంగా నటించారు. నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి రఘుశ్రీ, కన్వీనర్స్ కొక భవాని, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భాష, యాస కాపాడుకోవాలి
### ఆర్.వై.భరత్‌కాంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** తెలంగాణ భాషా, సంస్కృతి, సంప్రాదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని శాతావాహననగర్ కాలనీ యూత్‌అసోసియేషన్ సలహాదారుడు ఆర్.వై.భరత్ కాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శాతవాహననగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిన్నారులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పద్య, గేయాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి గౌరవఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆడిట్ శాఖ సంచాలకులు మార్తినేని వెంకటేశ్వరరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలలో 93 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్తినేని మాట్లాడుతూ కాళోజి నారాయణరావు గారి జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్నీ చేపట్టినందుకు నేను మిమ్మల్ని అభినందిస్తున్నాను అన్నారు. భవిష్యత్తులో తెలంగాణ భాష, సంస్కృతిని ఆదరించాలని పేర్కొన్నారు. తెలుగు భాష గౌరవింపబడేలా మనమందరం కృషి చేయాలన్నారు. మారుతున్న జీవనంలో చిన్నారులు, యువత, మన భాష సంస్కృతి, సంప్రాదాయాలు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్నప్పటి నుంచే తెలుగు భాషను వ్యవహారిక భాషగా అలావాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమం చేయడానికి శాతావాహననగర్ యువజన సంఘం ముందుకు రావాడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు.

# వినాయకసాగర్‌లోనే నిమజ్జనం

### ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్

**గోషామహల్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** వినాయక చవితి ఉత్సవాలు హిందువులలో వస్తున్న ఐక్యత, ధర్మ రక్షణ కోసం ఉపయోగపడాలని అందుకై ప్రతి హిందువు కంకణ బద్దులై ధర్మం కోసం పని చేయాలని గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవినూతల శశిధర్ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదిన వినాయక సాగర్‌లోనే నిమజ్జన కొనసాగుతుందన్నారు. సామూహిక వినాయక నిమజ్జనం బాలపూర్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఖైరతాబాద్ వినాయకుడు కూడా అదే రోజు శోభయాత్రను నిర్వహిస్తారన్నారు. సామూహిక వినాయక శోభయాత్ర ప్రారంభమై పాతబస్తీ మీదుగా పలక్‌నుమా, చంద్రాయ ణగుట్ట, షాలిబండ, చార్మినార్, మదీనా, అఫ్జల్‌గంజ్, సిద్దింబర్‌బజార్ మీదుగా వినాయక సాగర్ వైపు వెళ్తుందన్నారు. అదే విధంగా నగరంలోని 24 నియోజవర్గాల నుంచి వినాయక ప్రతిమలు శోభయాత్రలో కలుస్తాయన్నారు. చార్మినార్, ఎంజెమార్కెట్, ఎల్.బి స్టేడియం వద్ద ప్రధాన స్వాగత వేధికలు ఉంటాయన్నారు. పాతనగరం, కార్వాన్, నాంపల్లి ప్రాంతాల నుంచే కాకుండా దిల్‌సుఖ్‌నగర్ వైపుల నుంచి వినాయక ప్రతిమలకు స్వాగతం పలుకుతారన్నారు. ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. విదేశీ వస్తువులను బహిష్కరించాలన్నారు.

## వర్గీకరణలో 58 కులాలకూ
# న్యాయం చేయాలి

**అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో సుప్రీంకోర్టుగైడెన్స్‌కు వ్యతిరేకంగా సక్రమంగా లెక్కలు సేకరించకుండా ఆశాస్త్రీయంగా జరిగిన ఎస్సీ వర్గీకరణ చట్టం జి.ఓ 99వ ప్రకారం ఎస్సీలకు అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జె.ఎ.సి చైర్మన్ డాక్టర్ మందాల బాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జెఎసి చైర్మన్ బేర బాలకిషన్‌లు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడి చర్య మూలంగా ఎస్సీలలో 58 కులాలు పూర్తిగా అన్యాయం జరుగుతుందన్నారు. జటిలమైన సమస్యను మరోసారి ఆలోచించి మాలలకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. టి.పి.సి.సి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఎస్సిలలో 58 కులాలకు అన్యాయం జరుగకుండా చూస్తామని హామి ఇచ్చినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ వల గ్రూపు1,3లో ఉన్న కులాలకు నష్టం జరుగుతున్న విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో ఎవరికి కూడా అన్యాయం జరగకుండా చూస్తామని మాల జెఏసి ప్రతినిధులకు హామి ఇచ్చినట్లు వారు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో చెరుకు రాంచందర్, తెలంగాణ రాష్ట్ర మాల విద్యార్ధి జెఏసి అధ్యక్షులు మాదాసు రాహుల్, డాక్టర్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పత్ర పూజ

**చిక్కడపల్లి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్ రోడ్స్ శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో జరుగుతున్న స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భం గా మంగళవారం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఖివిధ పత్ర పూజఖి కార్యక్రమం నిర్వహించారు. ఆలయం చైర్మన్ మారిశెట్టి నరసింగ రావు, ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్నా ఉత్సవాల సందర్భంగా ఉదయం సుప్రభాతము, బిందెతీర్థం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభి షేకం, లక్ష్మీ గణపతి మూలమంత్ర హవనం, సాయంత్రం దూర్వార్చన, లక్ష్మీ గణపతి మహిళా భక్త సమానం, ఆధ్వర్యంలో లలిత విష్ణు సహస్రనామ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జె. శిశుకుమార్, ఎం. రాజేష్, డి. భానుచందర్, జి. భాగ్యలక్ష్మి, జి. సాయికీర్త్, గిరిబాబు తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ హయాంలో సేవలు చిరస్మరణీయం

### మాజీ డిప్యూటీ మేయర్

**నిజాంపేట్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాజశేఖరరెడ్డి సాగించిన పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సువర్ణ యుగాన్నే చవిచూసిందని, ఏ సమస్య ఎదురైనా ఆదుకునేందుకు రాజన్న ఉన్నాడన్న భరోసా జనానికి కలిగిందని మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. మంగళవారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ ఏనుగుల బొమ్మ వద్ద దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు, సురేష్ రెడ్డి, చిట్ల దివాకర్, బాలాజీ నాయక్ లు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబాశివా రెడ్డి, కుమార్ రెడ్డి, దండుగుల స్వామి, స్టాలిన్ రెడ్డి, ముత్యాలు ముదిరాజ్, బిక్షపతి, దివాకర్ రెడ్డి, శివ, మెహబూబ్, గౌస్, వైయస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు, వైఎస్ వెంకటేశ్వరులు, శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆర్ కె, ఏవి రెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వీరారెడ్డి, రవీందర్, లక్ష్మాజీ, కృష్ణ మూర్తి, శ్రీకాంత్ రెడ్డి, మహిళా నాయకులు నర్మద, లలిత రెడ్డి, నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళి**

**సైఫాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** దివంగత ఎపి సిఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా పేద, బడగుబలహీన వర్గాల ప్రజలకు విశేషమైన సేవలు అందించారని, ఆ సేవలు మరువలేనివని పలువురు ప్రముఖులు కొనియాడారు. వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటి ఆధ్వర్యంలో మంగళవారం నాడిక్కడ జరిగిన వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో యూనిటి ప్రతినిధులు డా.సుధాసత్యనాథ్, బిషప్ సింగం విల్సన్, డా.సుక్కా డానియేల్, డా.రాధామాథ్యూస్, సి.హెచ్.సుధీర్, బిషప్ ఆనంద్ తదతరులు ప్రసంగించారు. రైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా, రైతులకు రుణమాఫి, పేదలకు ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకం, 108 అంబులెన్స్ సౌకర్యం, ఇళ్ళు, ఇళ్ళపట్టాలు పంపిణి వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను రాజశేఖర్‌రెడ్డి చేపట్టారని వారు గుర్తు చేశారు..



## పోలీసు సిబ్బంది కోసం క్రికెట్ ప్రాక్టీస్ పిచ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** పోలీసు సిబ్బందిలో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించడానికి కుల్సుంపురా పోలీస్ క్వార్టర్స్‌లో కొత్తగా క్రికెట్ ప్రాక్టీస్ సౌకర్యాన్ని హైదరాబాద్ సీపీ సివి.ఆనందర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఆడి, సిబ్బందితో సరదాగా ముచ్చటించారు.



నార్సింగిలో ధర్నా చేస్తున్న బిఆర్ఎస్ నేతలు

## బిఆర్ఎస్ నేతల ధర్నా

**నార్సింగి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :** కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణను సిబిఐకి అప్పగించడను నిరసిస్తూ నార్సింగిలో బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి నాయ కత్వంలో బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున రేడి యల్ రోడ్డుపై బైఠాయించారు. దీంతో రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి రోడ్డుపై బైఠాయించిన నేతలను అరెస్టు చేసి నార్సింగి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు తెలంగాణ ప్రభుత్వంకు సద్బుద్దిని ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విష్ణు వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం వలన కోటి ఎకరాల మాగాణి సాగులోకి వచ్చిందని వివరించారు. అనుక్షణం తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపేందుకు మాజీ సీఏం కేసీఆర్ తపించారని, అలాంటి మహానేతపై బురదజల్లుతూ, అసత్య ఆరోపణలు చేయడం దారుణమని మండిపడ్డారు. ఎన్ని విచారణలు చేసినా కేసీఆర్ కడిగిన ముత్యంలో బయట పడుతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు నిజాముద్దీన్, రవి యాదవ్, వరదాచారి, ముత్యాలు, మల్లేష్, ఉదయ్, క్రాంతి, ప్రసాద్, రజనీకాంత్, గణేష్, నర్సిహ్మ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం
### ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**నిజాంపేట్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** గత కొద్దిరోజులుగా బిఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తూ ఎమ్మెల్సీ కవిత చేసే పనుల వలన పార్టీకి నష్టం జరుగుతుందని గుర్తించి, పార్టీకి నష్టం కలిగించే వ్యక్తి ఎవరినైనా ఉపేక్షి ంచేది లేదని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ, 60 లక్షల మంది సైనికులు, నాయకులు, కార్యకర్తలు ఉన్న సైన్యమని అన్నారు. కేసీఆర్ గతంలోనే చెప్పారు తప్పు చేస్తే కుటుంబ సభ్యులనైనా సహించమని, కన్నకూతురు కంటే కూడా కష్టంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్తు ముఖ్యమని తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమని అన్నారు.

## వైఎస్ ఆశయాలు సాధించాలి

**నార్సింగి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** దివంగత సీఏం వైఎస్సార్ ఆశయ సాధకు అందరం నడుం బిగించాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపల్ వట్టినాగులపల్లిలో మాజీ ఎంపిటిసి గొల్ల నాగేష్ యాదవ్ నాయకత్వంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సరూర్ నగర్ సర్కిల్-5

నిట్ నం. 11/EE5/SRNR/GHMC/2025-26, తేది: 02.09.2025
పనిపేరు: "డ్రైవర్ల యొక్క నియామకం" (01) నం. పని కొరకు. అంచనా మొత్తం: రూ.5.53 లక్షలు. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ & సమయం : 09.09.2025 మ.3.00 గం. అధికారి పేరు, చిరునామా & సెల్ నం: శ్రీ కె.రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC. (M) 9963550657. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.eprocurement.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC.
DIPR.NO. 7533-PP/CL/ADVT/1/2025-26 తేది: 02.09.2025

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAIGIRI DISTRICT ATL.B.NAGAR
O.S.NO. 931 OF 2025

Between:
1. Smt.Arisetty Eashwari w/o late A.Lakshmaiah aged 59 years, Housewife
2. Smt. Joshna Pushpala w/o Sandeep Kumar Pushpala, aged 42 years, Housewife R/o H.No. 1-6-202/18, Bapujinagar, Musheerabad, Hyderabad-40
3. Arisetty Bala Krishna S/o late Arisetty Lakshmaiah aged 40 years Occ Employee, Permanent R/o Flat No.107 G-Block, SriSai Anandamai Apts Chennareddy enclave, Peerzadiguda, Medipalli Mandal Medchal Malkajgiri Dist.TG Presently working and staying at 3624 Green Meadow LN. Flower Mound TX 75022, United States of America, Rep.by his other and GPA Holder Smt. Arisetty Eashwari wife of late A.Laxmaiah
....Plaintiffs
And
The Tahsildar, Medipalli mandal and another.
....Defendants
To:
All Concerned... 2nd Defendant
Please take notice that the Plaintiffs abovenamed filed the above suit for Declaration, to declare the Plaintiffs 1 to 3 as the legal heirs of deceased Sri Arisetty Lakshmaiah son of late A.Krishnaiah, who died intestate on 24.10.2024 in respect of the below mentioned schedule property. The said case stands posted to 16.09.2025. If any person/s is/are claiming to be the legal heirs of the said deceased, OR, having any objection in granting the said relief, may appear before the above said Court on the said date at 10:30 a.m. either in person or through your Advocate and submit your contentions with documentary evidence, failing which the matter will be heard and decided exparte.
SCHEDULE OF PROPERTY
All that Property bearing Flat No.107, in 1st floor with super built-up area of 1253 Sft. Including common areas in Block-G along with one car parking 100Sft Area in Lot No.27 in stile floor of Block G, together with undivided share of land adm. 64 sq.yds or 53.50 Sq.mtrs. out of Ac.5.07 guntas or 25023.82 Sq.yds (A to F Blocks land area is 22880.48 Sq.yds and Block- G. land area is 2142.34 Sq. Yds) in Survey No. 64, in the residential apartment complex known as "Sri Sai Anandmai" Apartments, Chennareddey enclave, Peerzadiguda village, Medipalli mandal, Medchal Malkajgiri District, and bounded on the. North by: Open to sky. South by: Open to sky and Flat No. 106. East by: Common corridor and open to sky. West by: Open to sky
(By order of the Court)
S.G.Poorna Chander Rao
Advocate
Address. No.3-2-4, 1 floor, R.P.Road, Secunderabad-500003TG
Cell No. 9346356367
Counsel for Plaintiffs

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE. R.R.DISTRICT. AT: HAYATHNAGAR.
O.S.NO. 703 OF 2025.
Between:
Pinninti Ponnamma & others
...Plaintiffs
And
The Tahsildar Abdullapurmet Mandal & another
... Defendants
To,
All Concerned
... Defendant No.2
Please take notice that the Plaintiffs have filed the above suit against you and another, to declare them as the legal heirs of deceased Pinninti Laxma Reddy. The above suit is posted to 17-09-2025. You are hereby summoned to appear before the Hon'ble Court on 17-09-2025, at about 10.30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided as per law. Hence this notice.
(BY ORDER OF THE COURT)
M/s. HEMANTH PRAVEEN KUMAR
Advocate & Associates
Plot No.71, Raghavendra Nagar, Hayathnagar, Hyderabad
Counsel for the Plaintiffs.

IN THE COURT OF THE HON'BLE XI ADDL DISRICT JUDGE, RANGA REDDY DISTRICT AT: L.B. NAGAR
OS NO. 237 of 2025
Between
Sri Viparthi Ravi Kumar
...Plaintiff
Smt. Polamuri Meena Kumari & Others
...Defendants
And
SUMMONS
To:
D-2 Smt. Bhulakshmi Aged major, Occupation: Housewife; H. No. 5-3-10/7, Dommativari Street, Near Subbarayudi Temnple, Amalapuram Municipality, Konaseema District (formerly East Godhavari District) -533201 A P.
or
C/o Ellori Srinivas & Rama Devi, Permanent Resident of: R/o 13-10, Railway Station Road, Attili Mandalam, West Godhavri Dist-534134.
Take notice that the above named Plaintiff had filed the above suit for Partition, Declaration of Legal Heirs and demarcation against you & Others and the same is posted to 23-09-2025 for your appearance either in person or through your pleader/advocate. Hence you are hereby directed to be present on 23-09-2025 at 10.30 am before the Hon'ble Court failing which the matter will be decided in your absence.
//BY ORDERS OF THE HONOURABLE COURT//
Sd/-
Mr. J. Kumaresan
S. Shekhar Reddy
Advocates
M/s. New Delhi Law Offices - Hyderabad, unit no. 10, 4TH Floor, Down Town, 6-2-27, 27/A, & 6-2-28, LakdiKa Pool, Hyderabad 500004
Cell: 9441476313
Counsel for the Plaintiff.

IN THE COURT OF HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, HYDERABAD, AT: HYDERABAD
O.S.NO. 3042 OF 2025.
BETWEEN:
Ram Kumar Jayam And 2others
...PLAINTIFFS
AND
THE TAHASILDAR AMBERPET and
...DEFENDANTS
To
ALL CONCERNED
NOTICE
Please take notice that the Plaintiffs had filed the above Suit seeking to declare them as Legal Heirs. The Hon'ble Court had posted the above Suit on 29.09.2025 to receive the objections of persons opposing.
If any person or persons have any objections, claim or concern of whatsoever against such relief, they may put forth their objections before the Hon'ble XIX Junior Civil Judge, City Civil Courts, Hyderabad, At: Hyderabad on 29.09.2025 at 10:30 either personally or through authorized counsel or otherwise the matter will be adjudicated in due process of law.
Hence, this NOTICE.
[BY ORDER OF THE COURT]
MD.NAVAB GIS MOHIUDDIN
ADVOCATE
Plot NO.39 Gokul Enclave
Hastinapur North Ext,
Hyderabad 500 079
Mobile No: 9989797188

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-VII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: MEDCHAL
O.S. No. 560of 2025
1. Smt. Makkala Satyamma,W/o. Late Sri. Makkala Beerappa, D/o. Late Sri. Banda Somaiah, R/o. H.No.6-91, Hanuman Nagar, Medchal, Medchal-Malkajgiri District
2. Sri. Banda Ramesh,S/o. Late Sri. Banda Somaiah, R/o. H.No.1-7/7A, Dundigal Village, Dundigal Gandimaisamma Mandal, Medchal-Malkajgiri District
3. Smt. Banda Yellamma,W/o. Late Sri. Banda Beerappa, R/o. H.No.1-65, Dundigal Village, Dundigal Gandimaisamma Mandal,Medchal-Malkajgiri
4. Smt. KarreMamatha, W/o. Sri. KarreSrishailam, D/o. Late Sri. Banda Beerappa, R/o. H.No.14-63, Thathapapanpally Village, Toopran Mandal, Medak District
5. Sri. Banda Rakesh, S/o. Late Sri. Banda Beerappa, R/o. H.No.1-65, Dundigal Village, Dundigal Gandi maisamma Mandal, Medchal-Malkajgiri Telangana State.
... Plaintiffs
And
1. The Tahsildar, Dundigal Gandimaisamma Mandal, 86, Gandimaisamma, Medchal-Malkajgiri District – 500 043,Telangana State.
2.All concerned ... Defendants
NOTICE
To
All Concerned (Defendant No.2)
The general public is hereby informed that the plaintiffs herein have filed the above suit for declaration to declare that the plaintiffs are the only surviving Class-I Legal Heirs of deceased of Late Sri. Banda Somaiah and Late Smt. Banda Muthyalu @ Banda Muthyalamma and the above suit stands posted to 15.09.2025, 10.30 am,If anybody has got any interest or objection for declaring the plaintiffs as legal heirs of Late Sri. Banda Somaiah and Late Smt. Banda Muthyalu @ Banda Muthyalamma, shall appear before the above Hon'ble Court, either in person or through an advocate, failing which the matter will be decided as per material available on record.
//BY ORDER//
M/s. G. Randeep Raj
Advocate & Associates
Plot No.12, Sripuri Colony, Kakaguda, Karkhana, Secunderabad

IN THE COURT OF THE HON'BLE 1ST JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT: SECUNDERABAD.
O.S.NO. 595 OF 2025
BETWEEN:
1. GOLKONDA PARVATHI, W/O. G.KRISAHNA, D/O. GORAK SATYANARAYANA & 5 OTHERS
... Plaintiff
AND
1. The Tahsildar, Secunderabad Mandal, Telengana State, Pin:-500016.
2. All Concerned ... Defendants
To
ALL CONCERNED
Please take notice that the Plaintiff has filed above suit for Declaration of Legal Heirs against you for declaring the Plaintiffas the sole and whole legal heirs of deceased Late. GorakSatyanarayana S/o. late. NarsaiahGorak, AND GorakSharada Bai, W/o. GorakSatyanarayanathe same is coming for your appearance on 09.09.2025. If anyone has any objections, you are hereby directed to appear before the court either in person or through Advocate on 09.09.2025 at 10.30 AM failing which the matter will be decided in your absence.
(BY ORDER OF THE COURT)
Sd/- D.RAVINDER YADAV, U.RAMESH, Y.RAJESH KUMAR, U.BHASKER RAO. T.SATYANARAYANA REDDY, H.DAYANAND, AND C.NIHARIKA, DANIEAL RAJ
Advocates,
No.9-3-45, Regimental Bazar, Opp. Secunderabad Metro station, St. Johns Road, Secunderabad-500025.
Phone: 9247893850, 82970 22299.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: MEDCHAL
O.S. No. 570 of 2025
BETWEEN:-
S.Lakshmi and another
...Plaintiffs
And
The Tahsildar,&Others
....Defendants
To,
ALL CONCERNED
Please take notice that the above-named Plaintiffs have filed the above suit against you and others for Declaration of legal heirs & others reliefs in the above court and the above said suit is posted on 15-09-2025 at 10:30 AM for your appearance either in person or through an advocate,failing which the case will be decided in your absence as per law.
"By order of Hon'ble court"
K.GANESH
B.com,LLB,
M.RAJANI
Advocates
H.No.4-99/1, Lalgadimalakpet Village, Shamirpet Mandal, Medchal-Malkajgiri District -500101.
Mobile No.9848745748.

## శ్రీ కృష్ణదేవరాయనగర్ అధ్యక్షుడుగా అమరేందర్ రెడ్డి



శ్రీ కృష్ణదేవరాయనగర్ నూతన కమిటీ ప్రతినిధులు.

**వనస్థలిపురం. సెప్టెంబర్.2.ప్రభాతవార్త**

బి.యన్.రెడ్డి నగర డివిజన్ శ్రీకృష్ణదేవరాయ నగర్. (ఎస్ కే డి నగర్) నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, కన్వీనర్ పుల్లారెడ్డి, కో కన్వీనర్ బొమ్మ రఘురాం నేత, ప్రధాన కార్యదర్శి.పి.శ్రీధర్ రావు, కోశాధికారి ఎన్ వి కృష్ణారావు , ఉపాధ్యక్షులు పాపారావు, కె.వి.రమణ, వి నారాయణ ,సంయుక్త కార్యదర్శి తులసి రెడ్డి ,రూపేల,నాగార్జున చారి.డి ముఖేష్. మరియు 12 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

## బేబీ పాండ్‌లో చిన్నపాటి గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయండి : కార్పొరేటర్



చిన్నపాటి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే బేబీ పాండ్ ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, అధికారులు.

**వనస్థలిపురం. సెప్టెంబర్.2.ప్రభాతవార్త.**

బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ లో వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటుచేసిన బేబీ పాండ్ ను బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మరియు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఈఈ రమేష్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ బేబీ పాండ్ మూడు అడుగుల లోపు ఉన్న విగ్రహాలను నిమజ్జనం చేయుటకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఇట్టి పాండ్ను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు మరియు నిమజ్జనం కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం డిఈ దామోదర్ రావు, ఏఈ కార్తీక్, జిహెచ్ఎంసి శానిటేషన్ విభాగం శీశీ అజీమ్ ఉద్దీన్ జవాన్ యాదయ్య, సచివాలయ నగర్ కాలనీ అధ్యక్షులు సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి బాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సూర్యనారాయణ, కల్చరల్ సెక్రటరీ హరీష్, ట్రెజరర్ రవికుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీధర్ కుమార్ మరియు కాలనీ కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం: ఎమ్మెల్యే



సంచార చేవల విక్రయ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**అబుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:**

తెలంగాణ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం కింద అనాజ్ పూర్ గ్రామానికి చెందిన పోలోమోని సుగుణ దర్శన్ ముదిరాజ్ కు మంజూరు చేసిన సంచార చేపల విక్రయ వాహనాన్ని మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని... అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ మేరకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ చిలుక మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి, నాయకులు ఏళ్ల నరేందర్ రెడ్డి, పాలెం శ్రీనివాస్ గౌడ్, మండలి నరసింహ, నార్లకొండ శ్రీశైలం పాల్గొన్నారు.

## ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి :డిసిపి



గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన డిసిపి చైతన్యకుమార్, అడిషనల్ డీసీపీ శ్రీకాంత్ లకు జ్ఞాపికలను అందజేస్తున్న నిర్వాహకులు సామా ప్రభాకర్ రెడ్డి, నవనీష్ రెడ్డి తదితరులుచిత్రంలో ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:**

ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి చైతన్యకుమార్ పేర్కొన్నారు. ముసారాంబాగ్ గడ్డి అన్నారం లో మడిగెల మహేందర్ రెడ్డి యూత్ అసోసియేషన్, మాజీ కార్పొరేటర్ సామా ప్రభాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహానికి డీసీపీ చైతన్యకుమార్, అడిషనల్ డీసీపీ శ్రీకాంత్, ఏసీపి సుబ్బరామిరెడ్డి, ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వాహకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సామా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, గడ్డి అన్నారం మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్లు వెంకటేష్ యాదవ్, గండి కృష్ణ యాదవ్, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు మహేందర్ రెడ్డి, నవనీష్ రెడ్డి, మడి గెల విజయభాస్కర్ రెడ్డి ,చిన్న, మనోహర్ రెడ్డి,నవీన్ రెడ్డి, సాయి రెడ్డి, సోను, వీరేష్, మధుకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## నిరాధార ఆరోపణలు సరికాదు : భూమయ్య

**సైదాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్‌లో జిహెచ్ఎంసి ద్వారా కేటాయించబడిన బాక్స్ డ్రెయిన్ నాలా నిర్మాణం పూర్తి చేసినప్పటికీ తమపై కొందరు కావాలని నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కాంట్రాక్టర్ భూమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌బిహెచ్ నగర్ కాలనీ పార్కు నుండి సుబ్రమణ్యనగర్ కాలనీ మోడల్ మార్కెట్ వరకు నింబంధనల మేరకు నాలా పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. పనులు పూర్తయిన తర్వాత అధికారులు అన్ని రకాల తనిఖీలు చేయడం జరిగిందని, అయితే ఇక్కడ పనులు చేపట్టకుండానే తాము బిల్లులు తీసుకున్నామని, నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాము చేసిన పనుల పూర్తి వివరాలను జిహెచ్ఎంసి కమీషనర్‌కు అందజేయడం జరిగిందని భూమయ్య తెలిపారు.



హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కొలన్ శివారెడ్డి నగర్ లో అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపం వద్ద గణనాథుడికి పూజలు చేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు కొలన్ నరేందర్ రెడ్డి,దేవేందర్ రెడ్డి,జి.నర్సింహులు, శ్రీనివాసరావు, చంద్రయ్య,భూమేష్,యాకుబ్ రెడ్డి,వెంకటేష్,గోవర్దన్, హనుమంతు రెడ్డి,పర్వత రెడ్డి తదితరులు



శ్రీ నవశక్తి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్డగుట్ట, ఈస్ట్ మారేడుపల్లి లో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీ నివాసుల సంక్షేమ సంఘము అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి



సైదాబాద్, ఐఎస్ సదన్ డివిజన్లలోని పలు గణనాధుడి మండపాలలో పూజలు నిర్వహిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు



రామంతాపూర్‌లో వినాయక మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు



గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బాలాపూర్, మల్లాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను అన్నదానాలు ప్రారంభిస్తున్న యెల్మేటి అమరేందర్‌రెడ్డి

# ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

# ప్రజల గుండెల్లో చిరస్మణీయుడిగా వైఎస్ఆర్



నేరెడ్‌మెట్ చౌరస్తాలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



లింగోజిగూడ డివిజన్‌లోని లిబర్టీ చౌరస్తా వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



ఆర్కేపురం డివిజన్ పరిధిలోని చిత్రాలేవుట్‌లో వైయస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి



బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్, అల్మాస్‌గూడల్లో వైఎస్ఆర్‌కు నివాళులర్పించిన మాజీ మేయర్ పారిజాత: చిత్రంలో నవారు మల్లారెడ్డి తదితరులు

## మాజీ సిఎం కెసిఆర్‌పై సిబిఐ కేసుకు నిరసగా బిఆర్ఎస్ ధర్నా



ఉప్పల్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, ఇతర నాయకులు

**ఉప్పల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** తెలంగాణ మాజీ సిఎం కేసీఆర్‌పై సిబిఐ అక్రమ కేసును నిరసిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితోపాటు, బిఆర్ఎస్ పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు బన్నాల గీత, ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్ శేఖర్, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం పార్టీ అని, కాంగ్రెస్ పార్టీ అసమర్ధ పాలనలో కాళేశ్వరం పైన కుట్ర చేస్తోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మూడు బ్యారేజ్‌లు,15 రిజర్వాయర్లు.. 21పంప్ హౌస్‌లు .. 203 కిలోమీటర్ల సొరంగం, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ ఉందన్నారు. అతిపెద్ద స్టోరేజ్ ప్రాజెక్టులో ఒక్క బ్యారేజీలోని 3పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్ట్ పోయినట్లా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ్ తెచ్చిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణను సిబిఐకి అప్పగిస్తే ఈ ప్రాజెక్టును ఎండబెట్టడమే జరుగుతుందన్నారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ సీబీఐ మోడీ చేతిలో ఉందని అంటున్నారని, రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి సిబిఐకి కాళేశ్వరం అప్పజెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మొత్తం 94 వేల కోట్ల ఖర్చు అయితే ఒక లక్ష కోట్లు అవినీతి ఎలా అంటారని ప్రశ్నించారు. మేడిగడ్డకు ఎందుకు రిపేరు చేయటం లేదన్నారు. గతంలో కేసీఆర్ రైతులకు యూరియా బస్తాలు ఇస్తే నేడు సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి డబ్బులు బస్తాలు మోసుకునిపోతురన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు, పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను ఇబ్బందులు పెడితే తెలంగాణ సమాజంపై దాడిగా ప్రజలు భావిస్తారు : సబితా ఇంద్రారెడ్డి



నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించి ఆచార్య జయశంకర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి ప్రసంగిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** తెలంగాణలో బిఆర్ఎస్ గొంతు నొక్కడానికే కాళేశ్వరం ప్రాజెక్టును ఆయుధంగా చేసుకొని రేవంత్‌రెడ్డి సర్కార్ సిబిఐ విచారణకు అప్పగించాలనే ప్రయత్నాలు చేస్తూ కెసిఆర్‌ను ప్రజల ముందు దోషిగా నిలబట్టే కుతంత్రాలు చేస్తున్నదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. సుదీర్ఘ పోరాటాల ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ సారథి కెసిఆర్‌ను ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నాలు యావత్ తెలంగాణ సమాజంపై దాడి యత్నాలుగా భావించాల్సి వస్తున్నదని ఆమె అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యారేజీ విషయంలో కెసిఆర్‌ను ప్రజల ముందు అభాసుపాలు చేయడానికి కాంగ్రెస్ చేస్తున్న కుయుక్తులను నిరసిస్తూ మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలో సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నల్ల జెండాలు, బ్యాడ్జీలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆమె బాలాపూర్ చౌరస్తాలోని మహనీయుల విగ్రహాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఆయన తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం బిఆర్ఎస్ పార్టీని, కెసిఆర్‌ను అణగదొక్కే కుట్రలు చేస్తున్నదని ఆమె అన్నారు. సంబంధిత ఎల్అండ్‌టి సంస్థల మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతు పనులను చేపట్టడానికి ముందుకు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోక కెసిఆర్‌ను దోషిగా నిలబట్టడానికే యత్నిస్తున్నదని ఆమె విమర్శించారు. రాష్ట్రంలో ఒక వైపు యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుంటే మరో వైపు మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వరదలతో ప్రజలు సతమతవుతుంటే వారిని ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్ళించేందుకు కాళేశ్వరం ప్రాజెక్ట్.. సిబిఐ విచారణ పేరిట కాలయాపన చేస్తున్నదని సబితారెడ్డి దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ 94 వేల కోట్లతో నిర్మాణం జరిగితే 1.47 లక్షల కోట్లతో జరిగిందనీ.. లక్ష కోట్ల అవినీతి జరిగిందని దుష్ప్రచారం కాంగ్రెస్ చేస్తున్నదని ఆమె ఆరోపించారు, అసెంబ్లీలో హరీష్‌రావు తన వాదనలు వినిపిస్తున్న సందర్భాల్లో 33 సార్లు అధికార పక్షం అడ్డుకున్నదని ఆమె అన్నారు. తెలంగాణ ప్రయోజనాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద తాకట్టు పెడుతున్నారని ఆమె ఆరోపించారు. బిఆర్ఎస్‌ను అణచి వేయడానికి కాంగ్రెస్, బిజెపిలు చేసే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారనీ వారి ఆటలు సాగనివ్వరని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, చిలకమర్రి నర్సింహ, మురుకుంట్ల అరవింద్‌శర్మ, అర్కల కామేష్ రెడ్డి, పెద్దబావి ఆనంద్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్, సునీతా బాలరాజ్, సిద్దాల లావణ్య బీరప్ప, బొక్క రాజేందర్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, లలితా జగన్, ఎనుగుల అనిల్ యాదవ్, దోమలపల్లి రాజ్‌కుమార్, సుర్వి లత శేఖర్‌గౌడ్, బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వరచారి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నాయకులు, పాల్గొన్నారు.

## పండుగలు సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి : కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ



హైందవి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహ నిమజ్జనం వేడుకలలో పాల్గొన్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ , కళాశాల ఇన్చార్జి ప్రియదర్శిని తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:**

పండుగలు సాంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ లోని హైందవి డిగ్రీ కళాశాల చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, కళాశాల ఇన్చార్జ్ ప్రియదర్శినిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహ నిమజ్జన వేడుకల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రత్యేకగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హైందవి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా శ్యామల



**తుర్కయంజాల్ సెప్టెంబర్ 2 ప్రభాతవార్త**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ గా దుగ్గని శ్యామలను నియమిస్తూ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నా మీద ఎంతో నమ్మకంతో కార్యకర్త యొక్క సేవలు గుర్తించి అన్న చేతుల మీదుగా తిరుమల హిల్స్ నివాసంలో నా మీద నమ్మకంతో రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా నియామక పత్రం ఇవ్వడం జరిగింది. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం గా పని చేస్తానని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు

## కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు



టీకా కార్యక్రమంలో కమిషనర్, బ్లూ క్రాస్ సంస్థ ప్రతినిధులు

**హయత్ నగర్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :**

రేబీస్ ఫ్రీ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ పరిధి 8వ వార్డు లోని అంబేద్కర్ భవన్ లో మంగళవారం కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలును వేశారు. హైదరాబాద్ బ్లూ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు 338 కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ రవీందర్ రెడ్డి, డా. శాంతి బాబు పాల్గొన్నారు.

## మేడిపల్లి మండల సీనియర్స్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా రాజిరెడ్డి

### సీనియర్స్ పాత్రికేయుల సమావేశంలో ఏకగ్రీవ ఎన్నిక



**మేడిపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :**

మేడిపల్లి మండల సీనియర్స్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షునిగా డి. రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడిపల్లిలో సీనియర్ పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్స్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేడిపల్లి మండల సీనియర్స్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షునిగా దొంతుల రాజిరెడ్డి (ఆంధ్రజ్యోతి) ఎన్నిక కాగా, గౌరవ అధ్యక్షులుగా సంకూరి మురళి ( ఆంధ్రప్రభ ), ఉపాధ్యక్షులుగా వర్దెల్లి రవీందర్ గౌడ్ ( సాక్షి ), ప్రధాన కార్యదర్శిగా వి. రవిచంద్ర ( నమస్తే తెలంగాణ ), కోశాధికారిగా సిహెచ్. సుదర్శన్ ( ఈనాడు ), క్రమశిక్షణ సంఘం చైర్మన్ గా లెల్లపాటి నర్సింహ రెడ్డి ( నమస్తే తెలంగాణ ), ముఖ్య సలహాదారులుగా వెల్లెంకి జయపాల్ రెడ్డి ( నేడు ), కార్యవర్గ సభ్యులుగా ఏ. వెంకటేశ్వర్లు ( సాక్షి ), జున్ను శ్రీనివాస్ గౌడ్ ( ప్రజాతంత్ర ), శిలివేరు వేణు ( నిఘా ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన నూతన అధ్యక్షుడు రాజిరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు . ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సీనియర్స్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డి. రాజిరెడ్డి మాట్లాడుతూ.. పాత్రికేయులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని తెలిపారు. ప్రభుత్వపరంగా పాత్రికేయులకు అందాల్సిన పథకాలపై జిల్లా, రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తానని వెల్లడించారు.

## పండుగలు సోదర భావాన్ని పెంపొందిస్తాయి : జిన్నారం



జిన్నారం విట్టల్‌రెడ్డిని సన్మానిస్తున్న కోలన్ శంకర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:**

పండుగలు సోదర భావాన్ని పెంపొందిస్తాయని చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్‌రెడ్డి పేర్కొన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా బాలాపూర్‌లోని బడ గణేష్, చైతన్యపురి డివిజన్ పరిధిలోని మారుతినగర్, భవానినగర్ ఏర్పాటుచేసిన గణపతి మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా గణపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు కోలన్ శంకర్‌రెడ్డి, నాయకులు పవన్‌కుమార్, పోచిరెడ్డి, ఎస్.కె.జాఫర్, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీరన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక



నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, అనిరెడ్డి కృష్ణారెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** పిఆర్‌టియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిరెడ్డి కృష్ణారెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పిఆర్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ వ్యవస్థాపకులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో రంగారెడ్డి జిల్లాలో పిఆర్‌టియు బలోపేతానికి కృషి చేస్తూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటామని అన్నారు. నూతన పిఆర్‌సిని వెంటనే అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న అయిదు డిఏలను తక్షణమే విడుదల చేయాలని, ఉద్యోగుల ఆరోగ్య రక్షణ పథకం (ఇహెచ్ఎస్)ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు అన్ని క్లియర్ చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, జిఓ 317 ప్రకారం రంగారెడ్డి జిల్లాలో అధికంగా ఉన్న ఉపాధ్యాయ క్యాడర్ స్ట్రెంత్‌ను వెంటనే సరిచేయాలని సమావేశంలో తీర్మాణించారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రావు, మంచిరెడ్డి అనంతరెడ్డి, గజ్జెల జనార్ధన్‌రెడ్డి వ్యవహరించారు.

## రూ.కోటి 84లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే



రూ.కోటి వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ డివిజన్‌లో రూ.ఒక కోటి 84 లక్షల వ్యయంతో చేపడుతున్న సీవరేజ్, స్టార్మ్ వాటర్ డ్రైన్ అభివృద్ధి పనులకు మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. డివిజన్‌లో ఒక ప్రణాళిక బద్ధంగా దశలవారీగా అభివృద్ధి పనులను చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ బీరప్పగడ్డ, బ్యాంక్ కాలనీ, అన్నపూర్ణనగర్, రాఘవేంద్రకాలనీలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఇ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు, కాలనీ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద పరమేశ్వర్‌రెడ్డి పూజలు



ఉప్పల్‌లోని వినాయక మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నేని ఫణీందర్ తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** ఉప్పల్,చిలకనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వరరెడ్డి పలు మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు. ఉప్పల్, చిలుకానగర్‌లలోని పలు మండపాల వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఉప్పల్‌లో ఎస్సీ సెల్ నేత లింగంపల్లి రామకృష్ణ ఇంట్లో పూజలు చేశారు. అనంతరం ఉప్పల్ శాంతినగర్,సత్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కిషోర్,బుత్కూరి మదన్ గౌడ్, బీరప గడ్డలో న్నారి నరేంద్ర,మహేందర్, ఇందిరానగర్,అంబేద్కర్ సంఘం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నేని ఫణీంద్ర, సల్ల ప్రభాకర్‌రెడ్డి, ఈగ అంజయ్య పలువురు మండప నిర్వహకులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో వినాయకుడి లడ్డూ రూ.2.80లక్షలు



వినాయకుడి లడ్డూతో ఎనుముల రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన వేలం పాటలో వినాయకుడి లడ్డూను రూ.2.80లక్షలకు ఎనుముల రవీందర్‌రెడ్డి దక్కించుకున్నారు. మూల విరాట్ వద్ద ఉన్న లడ్డూను బూడిద ప్రభాకర్‌రెడ్డి రూ.1.76లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి లావణ్య పాల్గొన్నారు.

## బాలాపూర్ గణేషుడు గ్రామ ప్రజలకు గర్వకారణం : సామల రంగారెడ్డి



**సరూర్‌నగర్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, లడ్డూ వేలం కార్యక్రమాల ద్వారా దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన బాలాపూర్ గణేషుడు బాలాపూర్ ప్రజలందరికీ గర్వకారణమని గ్రామ పెద్దలు, మాజీ పోలీస్ పటేల్, పూర్వ సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు సామల రంగారెడ్డి అన్నారు. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ప్రత్యేక ఆహ్వానం మేరకు మంగళవారం ఆయన సతీసమేతంగా గణనాథుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు రంగారెడ్డి, వినోద దంపతులచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు సామల దంపతులను సన్మానించి మినీ లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ బాలాపూర్ గ్రామ ప్రజల కొంగు బంగారం, కొలిచే దైవం గణేషుని ఆశీస్సులు ఎప్పటికీ ప్రజలపై ఉంటాయని అ న్నారు. ఈ సారి జరిగే గణేషుని శోభాయాత్ర, లడ్డూ వేలం పాటను ప్రశాంత వాతావరణంలో జరపాలని ఆయన ఆకాంక్షించారు.